PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 261 | విజయవాడ, సోమవారం 31 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 31 July 2023 | Rs

'పిఎస్‌ఎల్‌వి సి-56' విజయవంతం

- కక్ష్యలోకి చేరిన 7 సింగపూర్ ఉపగ్రహాలు
- ఇది పూర్తి వాణిజ్య ప్రయోగం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఇస్రో ఆదివారం మరో వాణిజ్యపరమైన రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. సరిగ్గా ఉదయం 6.31 గంటలకు మొదటి ప్రయోగ వేదికపై నుండి పిఎస్‌ఎల్‌విసి-56 (పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన డిఎస్-సార్ ఉపగ్రహంతోపాటు మరో ఆరు నానో ఉపగ్రహాలను భూమి నుంచి 535 కిలోమీటర్ల లోఎర్త్ కక్ష్యలో నిలిపింది. ఈ ఏడు ఉపగ్రహాల బరువు 442.5 టన్నులు మాత్రమే. తక్కువ బరువుగల ఉపగ్రహాలను ప్రయోగిస్తున్న కారణంగా కోర్ అలాన్ తరహాలో స్ట్రాపాన్లు లేకుండా ఈ రాకెట్‌ను శాస్త్రవేత్తలు నిర్మించి ప్రయోగించారు. కోర్ అలాన్ తరహాలో ఇది 17వ ప్రయోగం. సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలలో డిఎస్ ఎస్‌ఆర్ ముఖ్యమైనది. సింగపూర్‌లోని ఎస్‌టి ఇంజనీరింగ్ వారు దీన్ని రూపొందించారు. అక్కడి స్పేస్ ఏజెన్సీతో కలిసి రూపొందించిన ఈ ఉపగ్రహం రాత్రి పగలూ స్పష్టమైన చిత్రాలు తీసి శాస్త్రవేత్తలకు పంపించే సామర్థ్యం కలిగి ఉంది. ఒక మీటరు రిజల్యూషన్‌తో ఫొటోలు తీయగలదు. దీన్ని రాడార్ ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌గా అక్కడ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పిఎస్‌ఎల్‌విసి-56 ద్వారా ప్రయోగించిన వాటిలో నాన్ యంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (ఎన్‌టియు)కు చెందిన ఆర్కేడ్, వెలాక్స్ ఎఎం, స్కూబ్-2, ఎలైనా ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన ఒఆర్‌బి-12, స్ట్రైడర్, ఎన్‌యుఎస్‌కు చెందిన గెలాసియా-2, సింగపూర్‌లోని న్యూస్పేస్ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన నులియన్ ఉపగ్రహాలు ఉన్నాయి. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది 58వ ప్రయోగం. ఇప్పటివరకు మిగతా 5లో

స్పెయిన్ టైటిల్ విజేత భారత్

మూడు దేశాలు పాల్గొన్న స్పెయిన్ హాకీ ఫెడరేషన్ 100వ వార్షికోత్సవం అంతర్జాతీయ టోర్నమెంట్‌ను భారత మహిళల హాకీ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం మ్యాచ్‌లో 3-0తో స్పెయిన్‌పై భారత్ ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో మొత్తం నాలుగు మ్యాచ్‌ల్లో ఎనిమిది పాయింట్లతో భారత్ మహిళలు అగ్రస్థానంలో నిలిచారు. ఈ టోర్నీలో భారత పురుషుల జట్టు మూడో స్థానంలో నిలిచింది.

రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న హన్నన్‌మొల్లా, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు, అతుల్ కుమార్ అంజన్, మేథాపట్కర్, వెంకట్ తదితరులు

రైతు సమస్యలపై రెండో దశ ఉద్యమం

మతోన్మాద శక్తులను తరిమికొట్టాలి • కార్మిక, కర్షక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలోని రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రెండో దశ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు కార్మిక, కర్షకులపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టే ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించాలని కోరారు. మతోన్మాద శక్తులను దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకు కార్మికులు, కర్షకులు కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలను పెద్దఎత్తులో చేపట్టాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు విజయవాడలోని పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎఐకెఎస్ జాతీయ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా మాట్లాడుతూ రైతాంగం నిర్వహించిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా పండించిన పంటకు మద్దతు ధర కల్పన, రైతు రుణమాఫీ, విద్యుత్ చట్ట సవరణ చట్టం ఉపసంహరించుకుంటామని కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. ఏడాది గడిచినా ఇప్పటి వరకు వీటిలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆగ్రహించారు. జాతీయ డిమాండ్లతో పాటు రాష్ట్ర సమస్యలను జోడించి దేశ రాజధాని ఢిల్లీతో పాటు రాష్ట్రాల రాజధానుల్లో నవంబర్ 26,27,28 తేదిల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమం ఈ ప్రభుత్వాలకు హెచ్చరికగా ఉండేలా ఐక్య రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 9న 'క్విట్ కార్పొరేట్-క్విట్ ఫాసిస్ట్-క్విట్ కమ్యూనల్' నినాదంతో ఆందోళనలు చేపట్టాలని కోరారు. కార్పొరేట్, మతోన్మాద, ఫాసిస్ట్ శక్తులు వెనక్కి పోవాలంటూ ప్రతి జిల్లాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని బిజెపి ధ్వంసం చేసిందని, ఆ ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 15న అన్ని ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాలని అన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ప్రతి గ్రామంలో, ప్రతి రైతు వద్దకు ఉద్యమ స్ఫూర్తిని తీసుకెళ్లాలని కోరారు. ఎఐకెఎస్(అజయ్ భవన్) జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని కోరారు. దేశం కోసం పోరాడేందుకు సైన్యంలో ఎక్కువగా ఉండే ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి మత చిచ్చు రేపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రోజుకొక మాట చెబుతున్నారని, శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యంగా లేరని పేర్కొన్నారు. కార్మిక, కర్షక శక్తులు ఏకమై మోడీ సర్కార్‌ను, బిజెపిని దేశం నుంచి తరమాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఓడించేందుకు త్రిబుల్ ఇంజన్ (రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు) ఒకే వేదికపైకి వచ్చారని అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బిజెపి చిన్నాభిన్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థకు గత బడ్జెట్‌లో రూ.90వేల కోట్లు కోత పెట్టిందని తెలిపారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అందించాలంటే రైతులకు మద్దతు ధర ఉండాలని చెప్పారు. కులాలు, మతాలు పేరుతో గొడవలు సృష్టించి బిజెపి ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎపిలో కూడా క్రైస్తవులపై దాడి చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

కేంద్రంలో బిజెపిని ఓడిస్తే తప్ప ఎపికి న్యాయం జరగదన్నారు. సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని నాశనం చేసేందుకు మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. పేదలకు రేషన్ అందించడం లేదని, మరోపక్క పంటను పండిస్తున్న రైతులను కూడా బిజెపి సర్కార్ మోసం చేస్తోందని విమర్శించారు. ప్రకృతిపై ఆధారపడే వారికి మిగతా 5లో

గుండెలను పిండేసింది

సహాయక శిబిరాల్లో సహాయమే లేదు

- బాధితుల వెతలు వర్ణనాతీతం
- పథకం ప్రకారమే మైనార్టీ కుకీ మహిళలపై దాడులు
- డబుల్ ఇంజన్ ప్రభుత్వ విద్వేష రాజకీయాల ఫలితమే ఇది
- మణిపూర్ మారణకాండపై ప్రతిపక్ష ఎంపీల వ్యాఖ్య
- 21 పార్టీల ఎంపీల బృందం గవర్నరుకు మెమోరాండం అందజేత

మణిపూర్ గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రతిపక్ష ఎంపీల బృందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో మే 3న హింస ప్రారంభమైనప్పటి నుండి దాదాపు మూడు నెలల పాటు అరాచకం రాజ్యమేలుతుంటే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పక్షవాతం వచ్చినట్టుగా అచేతనంగా ఉండిపోయిందని, హింసను నియంత్రించడంలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ ఘోరంగా విఫలమయ్యాయని 21 ప్రతిపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమి బృందం స్పష్టం చేసింది. మే మొదటి వారంలో హింస తలెత్తినప్పుడే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదని వారు అన్నారు. మణిపూర్‌లో పరిస్థితిని మదింపు వేసేందుకు ప్రతిపక్ష కూటమి 'ఇండియా' కు చెందిన ఎంపీల బృందం రెండు రోజుల పాటు ఆ రాష్ట్రంలో పర్యటించింది. ఘర్షణలు తలెత్తిన ప్రాంతాల్లో పర్యటించడంతోబాటు, సహాయక శిబిరాల్లోని కుకీ, మెయితీలకు చెందిన బాధితులను కూడా కలిసింది. వారు అక్కడ నానా యాతన పడుతున్న విషయాన్ని కళ్లారా చూసిన బృందం చలించిపోయింది. రెండు రోజుల పాటు మణిపూర్‌లో పర్యటించి, ఘర్షణల బాధితులను కలుసుకొని, తెలుసుకొన్న విషయాలను ఆదివారం ఇంఫాల్‌లోని రాజ్ భవన్‌లోగవర్నర్ అనుసూయా ఉకీని కలిసి 21 మంది ఎంపిల బృందం నివేదించింది. ఈ సందర్భంగా సంయుక్తంగా మూడు పేజీల వినతిపత్రాన్ని సమర్పించింది. మణిపూర్‌లో శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించేందుకు గట్టి చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నరుకు విజ్ఞప్తి చేసింది. గవర్నరును కలిసిన అనంతరం రాజ్ భవన్ వద్ద కాంగ్రెస్ ఎంపి అధిర్ రంజన్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ ఘర్షణలకు సత్వరమే తెర దించకపోతే, దేశ భద్రతకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు. శని, ఆదివారాల్లో తాము రాష్ట్రంలో పర్యటించామని, తాము అనేక అంశాల గురించి తెలుసుకున్నామని అన్నారు. ఈ వివరాలను తాము గవర్నర్ వద్ద ప్రస్తావించామని తెలిపారు. గవర్నర్ స్పందిస్తూ, రాష్ట్రంలోని మిగతా 5లో

ఆత్మాహుతి దాడిలో 44 మంది మృతి

- 100 మందికి గాయాలు
- పాక్‌లో ఘోరం
- జెయుఐ-ఎఫ్ సదస్సు రక్తసిక్తం

క్షతగ్రాతులను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ఇస్లామాబాద్ : ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దును ఆనుకుని ఉన్న పాకిస్తాన్‌లోని ఖైబర్-పంక్తూన్‌ఖవా (కెపి) ప్రావిన్స్‌లోని బజౌర్ జిల్లా ఖర్ పట్టణంలో జమాతే ఉలేమా ఇస్లామ్-ఫజిల్ (జెయుఐ-ఎఫ్) నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో భారీ పేలుళ్లు సంభవించాయి. ఆత్మాహుతి బాంబర్ వేదిక సమీపానికి వచ్చి పేల్చుకున్నాడు. ఈ ఘటనలో 44 మంది మరణించగా, 120మంది గాయపడ్డారు. వీరిలో 17 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జెయుఐ-ఎఫ్ అనేది పాకిస్తాన్‌లో దియోబండ్ సున్నీ తెగకు చెందిన ఒక రాజకీయ పార్టీ. ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుండగా ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని కెపి ఆపద్ధర్మ సమాచార శాఖ మంత్రి ఫిరోజ్ షా జమాల్ ధ్రువీకరించారు. క్షతగాత్రులను పెషావర్, ఇతర ఆస్పత్రులకు హెలికాప్టర్ల ద్వారా తరలించారు. పేలుడు జరిగిన ప్రదేశాన్ని భద్రతా దళాలు సీల్ చేశాయి. సహాయక చర్యల్లో పాకిస్తాన్ సైన్యం, ఇతర విభాగాలు పాల్గొంటున్నాయని జమాల్ తెలిపారు. ఈ పేలుడులో జెయుఐ-ఎఫ్ నేత మౌలానా జియాఉల్లా జాన్ కూడా మరణించినట్లు బజౌర్ జిల్లా అత్యవసర విభాగ అధికారి సాద్ ఖాన్ మీడియాకు తెలిపారు. టెంట్ కింద నిర్వహించిన ఈ సమావేశానికి సుమారు 500 మంది దాకా జెయుఐ-ఎఫ్ సభ్యులు, మద్దతుదారులు హాజరైనట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. పెద్ద శబ్దంతో పేలుడు సంభవించిందని, వెంటనే తాను స్పృహ తప్పిపడిపోయానని, తిరిగి మెలకువ వచ్చేసరికి ఎక్కడ చూసినా నెత్తురోడుతున్న వారే కనిపించారని చెప్పారు.

కన్నీటి వరద

నీళ్లలోనే విలీన మండలాలు

ప్రభుత్వ సాయం అంతంతే

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల లేమి

చీకటిలోనే మగ్గుతున్న బాధితులు

చింతూరు మార్కెట్‌లోకి దూసుకొచ్చిన వరద

ప్రజాశక్తి- విఆర్.పురం, చింతూరు, ఎటపాక, కూనవరం విలేకరులు

ఈసారీ విలీన మండలాల ప్రజలను గోదావరి నిలువునా ముంచేసింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం గతంలో మాదిరిగానే చేష్టలుడిగి చూస్తుండడంతో వరద బాధితులు పడరాని పాట్లు పడుతున్నారు. విఆర్. పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లో ఎవరిని కదిపినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి. వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలని సిఎం ఆదేశించినా చాలామందికి ఆదివారానికి అవి చేరలేదు. ప్రభుత్వం నుంచి అంతంత మాత్రంగానే సాయం అందుతోందని పలువురు వాపోతున్నారు.

ఆదివారం మధ్యాహ్నానికి గోదావరి, శబరి నదులు కాసింత శాంతించాయి. అయితే, గోదావరి ఎగపోటు, శబరి బ్యాక్ వాటర్ ప్రభావంతో చింతూరు మండల పరిధిలో సుమారు వంద గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ మండలంలో 11 పునరావాస కేంద్రాల్లో బాధితులు తలదాచుకున్నారు. విఆర్.పురం మండలంలో దాదాపు అన్ని గ్రామాలూ వరద ప్రభావానికి గురయ్యాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం స్వల్పంగా తగ్గినా శబరి-గోదావరి సంగమం వద్ద మాత్రం పరిస్థితి భయంకరంగానే ఉంది. దీంతో, ఒడ్డుగూడెం, శ్రీరామగిరి ప్రాంతాల వారు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. భద్రాచలం వద్ద తగ్గి తమ ప్రాంతాల వద్ద వరద తగ్గకపోవడానికి కాఫర్ డ్యామే కారణమని వారు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు వచ్చిన తరువాత ఏటా తాము ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇదే మండలంలోని ధర్మతాలగూడెం, గొల్లగూడెం గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. అక్కడ కనీస సౌకర్యాలు లేవని వారు తెలిపారు. నిత్యావసర సరుకులు ఇవ్వలేదని, తాగునీరూ కరువైందని, రాత్రివేళ విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఎటునుంచి విష పురుగులు వచ్చి కుడతాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని తెలిపారు. తాము పునరావాస కేంద్రానికి వచ్చి మూడు రోజులవుతోందని, తమ నివాసాలు మూడు రోజులుగా నీళ్లలోనే ఉండడంతో అవి ఉన్నాయో, కూలిపోయాయో కూడా తెలీదని వాపోయారు. సర్వం ఇళ్ల వద్ద వదిలేసి పునరావాస కేంద్రాలకు వస్తే ఇక్కడ ఏ అధికారీ పట్టించుకోలేదని మిగతా 5లో

లంక గ్రామాల్లో ఆకలి కేకలు

- వరద బాధితులకు అందని ప్రభుత్వ సాయం

• లోపలి పేజీలో.. •

ఎంతటి త్యాగాలకైనా సిద్ధం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పాదయాత్రల్లో వక్తలు • పోరాటం ప్రారంభించి నేటికి 900 రోజులు

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని నాయకులు, కార్మికులు తేల్చి చెప్పారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం మొదలుపెట్టి సోమవారం నాటికి 900 రోజులవుతున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ఉక్కు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన గంగవరం, పెదగంట్యాడ, వడ్లపూడి, కూర్మన్నపాలెం, అగనంపూడి, ఉక్కునగరం ప్రాంతాల్లో ఆదివారం పాదయాత్రలు జరిగాయి. ఉక్కు కార్మిక చైతన్య భేరి పేరిట జరిగిన ఈ పాదయాత్రల్లో పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత కాలనీల్లో పెద్ద పెట్టున నినదించారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఎస్‌ఎన్.రావు, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పోరాటం కొనసాగుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోన్న ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడం తగదన్నారు. ప్లాంట్‌ను అమ్మేస్తామని పదేపదే బిజెపి మంత్రులు చెప్పడం శోచనీయమన్నారు. ప్రజల సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే హక్కు వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పాదయాత్రల్లో పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, ఎ.మసేనురావు, యు.రామస్వామి, వైటి.దాస్, వై.మస్తానప్ప, చిత్రాడ సన్యాసిరావు, శ్రీనివాసనాయుడు, జెర్రిపోతుల ముత్యాలు, దొమ్మేటి అప్పారావు, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసిత కాలనీలో పాదయాత్ర చేస్తున్న పోరాట కమిటీ నేతలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు

దాచుకున్న డబ్బులు.. ఉక్కు పోరుకు..

ఉక్కు పరిరక్షణ పోరాటానికి ఓ విద్యార్థిని తాను దాచుకున్న డబ్బులు అందజేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచింది. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కీర్తిశేషులు మంత్రి సత్యారావు మనవరాలు, నాయకులు మంత్రి గోపి నారాయణ కుమార్తె చార్మిల తాను కూడబెట్టుకున్న డబ్బులను ఆదివారం పోరాట కమిటీ నేతలకు అందజేసింది. ఇంటర్మీడియట్ చదువుతున్న ఆమె మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటం తప్పక విజయం సాధిస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు.

ఉర్దూ మాధ్యమం ప్రశ్నార్థకం

- ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు కరువు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో ఉర్దూ మాధ్యమం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉర్దూ భాషకు రాష్ట్ర ప్రభుత్వం ద్వితీయ భాష హోదా కల్పించినా, ఆ భాషలో చదివే విద్యార్థులకు బోధకుల్లేరు. మున్సిపల్ పట్టణాల్లోని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచరు ఒక్కరూ లేరు. దీంతో, ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్న విద్యార్థుల భవితవ్యం త్రిశంకు స్వర్గంలో పడింది.

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పట్టణంలో మైనార్టీ జనాభా 20 శాతం వరకు ఉంది. ఈ దృష్ట్యా పురపాలక సంఘంలోని 11వ వార్డులో ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఇక్కడ తరగతులు నడుస్తున్నాయి. ప్రస్తుతం 208 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు. ఎనిమిది తరగతులకు కలిపి ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. వారంతా సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటిలు). వారిలో ఒకరు తెలుగు ఉపాధ్యాయులు, మిగిలిన ఇద్దరూ ఉర్దూ మాధ్యమానికి సంబంధించిన వారు. ఆరవ తరగతి నుంచి బోధించాల్సిన సబ్జెక్టు టీచర్లు (స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు) ఒక్కరూ లేరు. విద్యార్థుల సబ్జెక్టులన్నీ ఉర్దూలోనే ఉండడంతో ఉన్న ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులే ఎనిమిది తరగతుల పిల్లలకూ సబ్జెక్టులు బోధించాల్సి వస్తోంది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు తొమ్మిది, పది తరగతులకు మరో ఉన్నత పాఠశాలకు వెళ్లాలి. అక్కడ ఉర్దూ మీడియం లేకపోవడంతో తెలుగులో చదువుకోవాల్సి వస్తోంది. దీంతో, ఉర్దూ చదువును మధ్యలోనే ఫుల్‌స్టాఫ్ పడుతోంది. ఇటువంటి పరిస్థితి ఈ ఒక్క పాఠశాలలోనే కాదు... ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కదిరి, రాయదుర్గం, హిందూపురంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలల్లోనూ ఉంది. ఈ పాఠశాలలు ఒక్క సబ్జెక్టు టీచరు కూడా లేకుండా నడుస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 221 ఉర్దూ మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 20 ఉన్నత పాఠశాలలు. రాష్ట్ర వ్యాప్తంగా 300కుపైగా ఉర్దూ మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి. 20 వేల మందికిపైగా విద్యార్థులు వీటిలో చదువుతున్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న రాయలసీమ జిల్లాల్లో ఉర్దూ విద్యనభ్యసించే వారు అధికంగా ఉన్నారు. వారిలో ఎక్కువ మంది బాలికలే. ఉపాధ్యాయులు లేని కారణంగా ప్రాథమిక విద్య వరకు చదువుకున్న తరువాత విద్యార్థినులు డ్రాపవుట్స్ అవుతున్నారు. ఆవాజ్ అనంతపురం జిల్లా కార్యదర్శి ముస్కిన్ మాట్లాడుతూ ఉర్దూ మాధ్యమంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి

మృతుడు కామయ్య (ఫైల్)

ప్రజాశక్తి- పోలాకి

సముద్రంలో పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి తోటి మత్స్యకారుల కథనం ప్రకారం... పోలాకి మండలం గుప్పిడిపేటకు చెందిన సిరిగిడి కామయ్య (51) చెక్క ఎర్రయ్య, రట్టి రాజయ్య, కర్రి సింహాచలం కలిసి సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. కొంతదూరం వెళ్లాక రాకాసి అలల ఉధృతికి పడవ బోల్తా పడడంతో నలుగురూ నీటిలో పడిపోయారు.

ఎర్రయ్య, రాజయ్య, సింహాచలం ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. కామయ్య రాకపోవడంతో తిరిగి ఈదుకుంటూ పడవ దగ్గరకు వెళ్లారు. బోల్తా పడిన పడవను మామూలు స్థితికి తీసుకొచ్చారు. పడవ కింద కామయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. ఆయన మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. కామయ్యకు భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

శాంతించని గోదావరి

- భద్రాచలం వద్ద 3వ ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ఇక్కడ, కాటన్ బ్యారేజీ వద్ద 2వ ప్రమాద హెచ్చరిక కొనసాగింపు
- ధవళేశ్వరం వద్ద 15.75 అడుగుల నీటిమట్టం

రాజమహేంద్రవరంలో రైల్ వంతెన వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి ఇంకా ఉగ్రంగానే ఉంది. శనివారంతో పోలిస్తే ఆదివారం భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గినా, కాటన్ బ్యారేజీ వద్ద పెరిగింది. విలీన గ్రామాలు, లంకలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం 49.50 అడుగులకు తగ్గడంతో ఇక్కడ మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాటన్ బ్యారేజీకి వరద గంటగంటకూ పెరిగి 16 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 16,32,780 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని రేవులు, స్నానఘట్టాలను అధికారులు మూసేశారు. పి.గన్నవరంలో కనకాయలంక నీట మునిగింది. అక్కడ ప్రజలు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. రాజమండ్రిలో బ్రిడ్జి లంక ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనరామునిలంక, అప్పనపల్లి, పాసర్లపూడి, పి.గన్నవరం మండలంలో 30 గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి.

ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే ఎగువన 34.280 మీటర్లు, దిగువన 26.220 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం వద్ద 35.460 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాం వద్ద 25.480 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 26.017 మీటర్లు ఉంది. ప్రాజెక్టులోకి వస్తున్న 13,80,216 క్యూసెక్కుల అదనపు జలాలను విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. దీంతో, పోలవరం ప్రాజెక్టుకు రాకపోకలు సాగించే కడెమ్మ వంతెన, పోలవరం ప్రాజెక్టు పోలీస్ చెక్‌పోస్టు నీట మునిగాయి. పోలవరం ప్రాజెక్టుకు రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. పోలవరం ప్రాజెక్టు అధికారులు, కార్మికులు కడెమ్మ అవుట్ ఫాల్ స్లూయిస్ మీదుగా ప్రాజెక్టుకు రాకపోకలు సాగిస్తున్నారు. వేలేరుపాడు మండలం బెస్తగూడెం ఎస్‌సి కాలనీల్లోకి వరద చేరుతుండడంతో 150 కుటుంబాలు రావికుంట కాలనీకి వెళ్లాయి. కాఫర్ డ్యామ్ ప్రభావం, శబరి నదికి భారీగా వరద నీరు చేరి పోటెత్తడంతో మండలంలోని రహదారులపై నీరు తగ్గడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నీటిమట్టం 40 అడుగులు ఉంది. ఈ నది ఉధృతి కొనసాగుతుండడంతో 115 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఎపి, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి రాకపోకలు నిల్చిపోయాయి.

ముంపు ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని రావికుంట పునరావాస కాలనీలో ఉంటున్న గొమ్ముగూడెం, బెస్తగూడెం ఎస్‌సి కాలనీ, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామాల వరద కుటుంబాలను సిపిఎం బృందం పరామర్శించింది. వారి సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.కిశోర్ తదితరులు ఉన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు వద్ద మాచేనమ్మ ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన వరద నీరు

పేదరికం తగ్గింది

- మంత్రి కారుమూరి
- గుంటూరు మిర్చియార్డు కార్యదర్శిగా నిమ్మకాయల రాజనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానం ద్వారా వివిధ పథకాల నగదు మొత్తం నేరుగా లబ్దిదారుల ఖాతాలకు జమ చేస్తుండటం వలన పేదరికం తగ్గిందన్నారు. గత ప్రభుత్వంలో 11.10 శాతం ఉండగా ప్రస్తుతం ఆరు శాతానికి తగ్గిందని తెలిపారు. పథకాల ద్వారా వచ్చిన డబ్బులతో పేదలు మంచి ఆహారం తింటున్నారని, బట్టలు ధరిస్తున్నారన్నారు. గుంటూరు మిర్చి యార్డు పాలక మండలి ప్రమాణస్వీకార సభలో ఆయన పాల్గొన్నారు. యార్డు చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ, వైస్ చైర్మన్‌గా షేక్ సుభాని, యార్డ్ డైరెక్టర్లతో శాసనసభ్యులు మద్దలి గిరిధరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ.. మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో బిసిలకు పెద్ద పీట వేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. గతంలో వివిధ సంక్షేమ కార్పోరేషన్‌ల ద్వారా వందల మందికి కూడా లబ్ధి జరిగేది కాదని, నేడు లక్షల మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పవన్ కల్యాణ్ ఓ ప్యాకేజీ స్టార్ అని విమర్శించారు. తక్కువ కాలంలో ఎక్కువ పార్టీలతో స్నేహం చేసిన ఘనత పవన్ కల్యాణ్‌దేనని ఎద్దేవా చేశారు. ఎంపి లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ముస్తాఫా,ఎమ్మెల్సీలు లేళ్లఅప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, జంగా కృష్ణమూర్తి, కల్పలతా రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కిల్లో సురేంద్ర, తదితరులు

మణిపూర్ ఆదివాసీలపై దాడులను నిరసిస్తూ
3న మన్యం బంద్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, అమానుష చర్యలను నిరసిస్తూ ఆగస్టు 3న రాష్ట్ర వ్యాప్తంగా మన్యం బంద్‌కు ఆదివాసీ గిరిజన, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం, దండకారణ్య విమోచన సమితి - అనుబంధ సంఘాలు, ఆదివాసీ గిరిజన మహిళా సంఘం, సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సమాఖ్య, ఎఐఎస్‌ఎఫ్ తదితర సంఘాలు ఆదివారం సమావేశమయ్యాయి. మణిపూర్‌లోని హింసాకాండను ఖండించాయి. అక్కడి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా ఆదివాసీ నేతలు మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన అటవీ పర్యావరణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఆంధ్ర రాష్ట్రంలో రద్దు చేసిన జిఒ నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించి ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విలీన మండలాల్లో వరద బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల సహాయక చర్యలూ చేపట్టాలని, పోలవరం నిర్వాసితులకు శాశ్వత పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. చింతపల్లి, అనంతగిరి మండలాల్లో ఏర్పాటు చేస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షులు తెలమల రంజిత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్, ఆదివాసీ గిరిజన మహిళా సంఘం, సిఐటియు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, గిరిజన సమాఖ్య, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీల్లో
యథేచ్ఛగా ఉల్లంఘనలు

- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీల్లో యథేచ్ఛగా ఉల్లంఘనలు జరిగాయని, ఇందుకు సంబంధించి ఈనెల 31న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల సహకారంతో ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యాశాఖ కమిషనరు దృష్టికి తీసుకెళ్తామని జిసిజిటిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎమ్.శ్రీనివాసరెడ్డి, జిసిటిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎమ్.శ్యామ్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలు నిర్వహించడానికి ప్రభుత్వం జీఓ నెంబర్ 86 విడుదల చేసిందని, ఆ జీఓ ప్రకారం ఈ నెల 31లోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. అటానమస్ కళాశాలల్లో పనిచేయాలంటే లెక్చరర్‌గా రెండేళ్ల సర్వీస్ ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. విద్యాశాఖ ముందుగా ఇచ్చిన ఉత్తర్వుల్లో ఒక స్టేషన్లో రెండు సంవత్సరాలు పనిచేసిన వారు అటానమస్ కాలేజీల్లో బదిలీలకు దరకాస్తు చేసుకోవాలని పేర్కొన్న నేపథ్యంలో అధ్యాపకుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయన్నారు. ఉత్తర్వులను సవరించి అధ్యాపకులుగా రెండేళ్ల సర్వీస్ ఉన్న వారికి కూడా ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వడంతో అనేక మంది అవకాశాలు కోల్పోయారని తెలిపారు. నాన్ అటానమస్ కళాశాల బదిలీలకు సంబంధించి ఒక స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న అధ్యాపకుడిని, ఆ స్థానానికి ఎవరైనా దరకాస్తు చేసుకుంటే మాత్రమే బదిలీ చేయాలనే నిబంధన ఉందని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రిన్సిపాల్స్ మీద ఒత్తిడి చేసి అందరూ కూడా వెబ్ ఆప్షన్ నమోదు చేయాలని బలవంత పెడుతున్నారని జిసిజిటిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎమ్.శ్రీనివాసరెడ్డి, జిసిటిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎమ్. శ్యామ్‌బాబు ఆరోపించారు.

లంక గ్రామాల్లో ఆకలి కేకలు

- వరద బాధితులకు అందని ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి- యలమంచిలి (ఏలూరు జిల్లా)

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం నుండి ఎటువంటి సాయమూ అందక ఆయా లంక గ్రామాల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. మండలంలోని కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, దొడ్డిపట్ల గ్రామాల వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గతంలో వరదల సమయంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదని బాధితులు వాపోతున్నారు. పునరావాస కేంద్రాలకు వస్తేనే భోజనాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. లంక గ్రామాల ప్రజలు మాత్రం తమ ఇళ్లను, పశువులు, మేకలు, కోళ్లను వదిలి ఎక్కడో దూరప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. దీంతో, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలకు అధికారులు కనీసం తాగునీరు, పాలు వంటి వాటిని కూడా అందించలేదు. పడవల్లో బయటకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకొనే పరిస్థితి లేక పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. గత పది రోజులుగా ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమను భోజనాలు, తాగునీరు వంటివి అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



వరదొచ్చి మా పల్లిపాలెం కాలనీ మొత్తం పీకల్లోతు మునిగిపోయినా ఇప్పటి వరకు మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేడు. వరద బాధితుల గోడు ఈ ప్రభుత్వానికి పట్టకపోవడం చాలా బాధ కలిగిస్తోంది. బాధితులందరికీ తాగునీరు, భోజనాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం మానవత్వం చాటుకోవాలి.

- కర్రి వెంకటేశ్వరరావు, లక్ష్మీపాలెం

పస్తులుంటున్నాం

గ్రామానికి దూరంగా ఎక్కడో కోనసీమ జిల్లాలోని తాటిపాక కల్యాణ మండపం వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. బాధితులందరినీ అక్కడికి రమ్మని చెబుతున్నారు. అక్కడికి వెళ్లడం లేదని కనీసం చిన్న పిల్లలకు పాలు కూడా అందించడం లేదు. దీంతో, చిన్నా, పెద్ద తేడా లేకుండా పస్తులుండాల్సి వస్తోంది.

- ముస్కూడి నరేష్‌బాబు, కనకాయలంక

ఆహారం అందివ్వడం లేదు

గతంలో వరదలు వచ్చిన ప్రతిసారీ పునరావాస కేంద్రాలకు వెళ్లకపోయినా మా కనకాయలంక గ్రామంలో పది వార్డులు ఉంటే ప్రతి వార్డుకీ ఒక బోటును ఏర్పాటు చేసి అల్పాహారం, భోజనాలు అధికారులు అందించేవారు. ఇప్పుడు మాత్రం పస్తులు పెడుతున్నారు.

- పులి శ్రీరామ్మూర్తి, కనకాయలంక

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో జరిగిన సదస్సులో మాట్లాడుతన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు.

మణిపూర్ మారణహోమానికి ప్రభుత్వాలే కారణం

- ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు
- దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్ మారణహోమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. 'మణిపూర్ మారణ హోమం ఎందుకు జరిగింది? కారణం ఎవరు?' అనే అంశంపై ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు సత్య బిఇడి కళాశాలలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు జరిగింది. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సంకురాత్రి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ.. మణిపూర్‌లోని గిరిజనుల పొత్తిళ్లలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నిన కుట్రలో భాగమే మారణహోమానికి ఆజ్యం పోసిందన్నారు. కుకీల నివాస ప్రాంతమైన కొండ ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకుని ఖని సందను కొల్లగొట్టవచ్చని కార్పొరేట్ శక్తులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయాయని విమర్శించారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న కొంతమంది మైతీలను రెచ్చగొట్టి కుకీ, నాగాలపై దాడులు చేయించి మణిపూర్‌ను రావణకాష్టంగా మార్చారని మండిపడ్డారు. 80 రోజులుగా ఆ రాష్ట్రం శవాల దిబ్బలుగా మారుతుంటే ప్రధాని మోడీ మౌనం వహించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు.

మణిపూర్‌లో మారణ కాండను ఆపాలని, మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ పలు జిల్లాలో నిరసనలు తెలిపారు. విజయవాడ ముత్యాలంపాడులో కెవిపిఎస్, అంబేద్కర్ కాలనీ యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడారు. విజయవాడ వాంబేకాలనీలో భారీ ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో విద్వేషాలు లేకుండా శాంతి యుతంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాంబేకాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. నగరంలోని గాంధీజీ వాటర్ ట్యాంక్ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి యు వాసు పాల్గొని మాట్లాడారు. బనగానపల్లెలో జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో మానవతా ర్యాలీ, ఆత్మకూరులో దళిత సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. కర్నూలు జిల్లా ఆలూరులో దళిత క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. గుంటూరులో పెదకాకాని, తాడేపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గుంటూరులో శంకర్ విలాస్ సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. పల్నాడు జిల్లా యడ్లపాడులో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేశారు. చిలకలూరిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సభ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో పట్టణ పౌర సమాజం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నిడదవోలులో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు నిరసన ప్రదర్శన చేట్టారు. కడియంలో లూథరన్ దేవాలయం సభ్యులు, రాజమహేంద్రవరంలో లూథరన్ చర్చ్, ఉండ్రాజవరంలో లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో క్రైస్తవులు శాంతియుత ప్రదర్శన చేపట్టారు.

యుసిసిపై బిజెపికి మాట్లాడే అర్హతలేదు

- 21వ లా కమిషన్ నివేదికపై నోరుమెదపదెందుకు
- భిన్నంగా వుండే హిందువుల సాంప్రదాయాలను ఎలా ఏకతాటిపైకి తెస్తారు
- 'సంగమం' సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఏకరూప పౌర స్మృతి (యుసిసి)పై 21వ లా కమిషన్ సిఫార్సులను చర్చకు పెట్టకుండా, రాష్ట్రాలకు పంపకుండా తొక్కిపెట్టిన బిజెపికి యుసిసిపై మాట్లాడే అర్హత లేదని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ విమర్శించారు. 21వ లా కమిషన్ సిఫార్సులపై తేల్చకుండా 2020లో మరో కమిషన్ వేసి, ఆ కమిషన్ గడువు పొడిగించడంలో ఆంతర్యమేమిటో తెలియనిది కాదని ఆయన అన్నారు. ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సంగమం ఆధ్వర్యంలో యుసిసిపై సదస్సు జరిగింది. సంగమం కన్వీనర్ డాక్టర్ పరిమి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఎంవిఎస్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్ల కాలంలో ప్రజాసమస్యలను పరిష్కరించకుండా, చేసిన వాగ్దానాలలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, మైనార్టీల మీద విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఏదో ఒక అంశాన్ని ముందుకు తెస్తోందని విమర్శించారు. 20ఏళ్లపాటు రామమందిరం జపం చేసిన బిజెపి తర్వాత 370 ఆర్టికల్ అని, ఇప్పుడు యుసిసిని ముందుకు తెస్తోందని అన్నారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ దేశమంతా ఒక్కటే వుందని, కాని వ్యక్తిగత అంశాలకు సంబంధించిన వివాహం, విడాకులు, దత్తత, వారసత్వానికి సంబంధించి విభిన్న మతాలు, కులాలు, భాషలు, సంస్కృతులు కలిగిన దేశంలో వేర్వేరుగా వున్నందున సివిల్ ప్రొసీజర్ కోడ్ వేరుగా వుందన్నారు. రాజ్యాంగంలో యుసిసి దిశగా నడవాలని చెప్పినా అందుకు దేశం సామాజికంగా, ఆర్థికంగా సమానత్వం సాధించాలని చెప్పిందనే అంశాన్ని బిజెపి ఉద్దేశపూర్వకంగా దాస్తోందన్నారు. దేశంలో భిన్న మతాలు, కులాలు, భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు వున్నాయని ముస్లిమ్‌లను అడ్డుపెట్టుకొని హిందువులను రాజకీయంగా గుప్పెట్లో పెట్టుకునేందుకు బిజెపి వేస్తున్న ఎత్తుగడ అని అన్నారు. హిందువులలో కూడా దక్షిణ భారతదేశం, ఉత్తర భారత దేశానికి సంబంధించి భిన్నమైన సంస్కృతులు వున్నాయని అన్నారు. దక్షిణ భారత దేశంలో బంధువుల మధ్య మేనరిక వివాహాలు చేసుకునే సాంప్రదాయం వుంటే హర్యానాలో అది తప్పు అవుతుందన్నారు. అలాగే షెడ్యూల్ తెగల్లో బహుభార్యత్వం వుందని, అలాగే నాగాలాండ్‌లో మహిళలకు ఎలాంటి రిజర్వేషన్లు వుండవని తెలిపారు. గోవాలో యుసిసి వుందనే బిజెపి నాయకులు అక్కడా మహిళలకు 25 ఏళ్లలో పిల్లలు కలగకున్నా, 30 ఏళ్లలో మగబిడ్డకు జన్మనివ్వకున్నా భార్యకు విడాకులు ఇవ్వవచ్చు అనే చట్టం వుందనే అంశాన్ని తెలుసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు ప్రత్యేక హక్కులు వున్నాయని అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా నాన్‌లోకల్స్ భూములు కొనకూడదని చట్టం వుందని అన్నారు. బిజెపికి కావాల్సింది పూర్తిగా లౌకికతత్వంతో కూడిన యుసిసి కాదని, ఆ అంశంతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడమేనని అన్నారు. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లో వున్న బాల్యవివాహాల నిషేధం, వరకట్నం నిషేధం లాంటివి ఏమాత్రం పరిష్కారం అయ్యాయో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. హిందూ మహిళల పట్ల వివక్షను రూపుమాపేందుకు భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సూచన మేరకు అంబేద్కర్ తీసుకొచ్చిన హిందూకోడ్ బిల్లును ఆరెస్సెస్, దాని రాజకీయ విభాగమైన జనసంఘ్ తీవ్రంగా వ్యతిరేకించిందన్న అంశాన్ని మరువరాదన్నారు. వివాహం, విడాకులు, దత్తత, ఆస్తులకు సంబంధించిన అంశాలు మతం నుండి వేరుపడినప్పుడే యుసిసి సాధ్యమవుతుందన్నారు. నరేంద్రమోడి హయాంలో 2017లో వేసిన 21వ లా కమిషన్ అలాంటి సిఫార్సులు చేసినందునే దాన్ని పక్కన పెట్టి కాలయాపన చేసేందుకు 22వ లా కమిషన్‌ను వేసి 2024వరకు అంటే ఎన్నికలయ్యేదాకా గడువు పెట్టారని తెలిపారు. బిజెపి కుట్ర పూరిత వ్యవహారాలను ప్రజలకు వివరించాలని కోరారు. సంగమం ప్రతినిధులు బుడ్డిగ జమిందార్, విజయప్రకాష్ వేదికపై ఆసీనులయ్యారు.

సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

నేరాల అధ్యయనానికి కమిటీ వేయాలి

- బిజెపి పాలనలో దళిత, మైనార్టీ, ముస్లిం మహిళలపై నిరంతరం దాడులు
- కొనసాగిన ఐద్వా పోరుయాత్ర

విజయనగరంలోని కలెక్టరేట్ కూడలిలో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతున్న ప్రభావతి

ప్రజాశక్తి - యంత్రాంగం

మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణులతో కూడిన కమిటీ వేయాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' అన్నమయ్య జిల్లా మీదుగా చిత్తూరుకు, విశాఖలో ప్రారంభమైన యాత్ర పార్వతీపురం మన్యం మీదుగా విజయనగరంలోనికి ప్రవేశించింది. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో పోరుయాత్రకు సిఐటియు, యుటిఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, శ్రామిక మహిళా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడారు. మహిళలపై హింసను నివారించడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటామనేది అధికార, ప్రతిపక్షాలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మీడియా మానిటరింగ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియళ్లు, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. మద్యం మత్తు వల్ల మహిళల జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతున్నాయి అనే నాటికను ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు వై.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లాలోకి యాత్ర ప్రవేశించనుంది.

చిత్తూరులో ఎస్‌సి, బిసి మహిళా హాస్టల్, సావిత్రమ్మ డిగ్రీ హాస్టల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో స్త్రీజాతికి స్వతంత్రం ఎక్కడ వచ్చిందని ప్రశ్నించారు. మణిపూర్‌లో జరిగిన ఘటన ప్రపంచం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, కానీ దేశ ప్రధాని మాత్రం మౌనంగా ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, మైనార్టీ, ముస్లిం మహిళలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో, పనిప్రదేశాల్లో వేధింపులను నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీలకు కల్పించిన రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకునే విధంగా పాలకులపై ఒత్తిడి తీసుకురావాలని అన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలను కోరారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన ఆంక్షలు విధించాలన్నారు. హింస లేని సమాజం కోసం జరుగుతున్న పోరుయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఆశా యూనియన్, వ్యకాసం నాయకులు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా మీదుగా ఆదివారం శ్రీకాళహస్తిలోకి యాత్ర ప్రవేశించనుంది.

మిడ్డేమీల్స్‌పై ధరాభారం

- పెరిగిన కూరగాయల ధరలతో కార్మికుల అవస్థలు
- బడ్జెట్ పెంచని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- 'జగనన్న గోరుముద్ద'కు అరకొర కుకింగ్ ఛార్జీలు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

మధ్యాహ్న భోజన పథకానికి పెరిగిన కూరగాయల ధరలు కాక పుట్టిస్తున్నాయి. విపరీతంగా వీటి ధరలు పెరగడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం వండి వడ్డించడానికి మిడ్డే మీల్స్ వర్కర్లు నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్ల క్రితం నిర్దేశించిన బడ్జెట్‌నే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అరకొర కుకుంగ్ ఛార్జీలతో వండి పెట్టాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మిడ్డే మీల్స్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం పేరును 2020 జనవరి 21 నుంచి రాష్ట్ర ప్రభుత్వం మార్పుచేసి 'జగనన్న గోరుముద్ద'గా అమలు చేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3,322 ప్రాథమిక పాఠశాలల్లో 1,78,434 మంది విద్యార్థులు, 347 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,24,874 మంది, 599 ఉన్నత పాఠశాలల్లో 86,696 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 4,268 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 3.90 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో 28 మండలాల్లోని 808 పాఠశాలల్లో 1.35 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని స్వచ్ఛంద సంస్థలు సరఫరా చేస్తున్నాయి. మిగిలిన పాఠశాలల్లో మొత్తం 8,116 మంది మిడ్డే మీల్స్ వర్కర్లు పనిచేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థికి రూ.8.57 చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి కొత్త మెనూ అమల్లోకి వచ్చింది. సోమవారం బిర్యాని, గుడ్డు కూర, మంగళవారం పులిహోర, గుడ్డు, టమోటా పచ్చడి లేదా దొండ పచ్చడి, బుధవారం బిర్యాని, బంగాళాదుంప కుర్మా, గుడ్డు, గురువారం సాంబారు బాత్ లేదా లెమన్ రైస్, గుడ్డు, పచ్చడి, శుక్రవారం పప్పు, ఆకుకూర, గుడ్డు, శనివారం గ్రీన్ రైస్, పప్పుచారు, చక్కెర పొంగలి ఇవ్వాలి. అయితే, మారిన మెనూ మేరకు ప్రభుత్వం కుకుంగ్ ఛార్జీలు పెంచలేదు.

ధరల మంట

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం రైస్, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి, బెల్లం మాత్రమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, నూనె, కందిపప్పు, గ్యాస్ తదితర వాటిని ప్రభుత్వం ఇస్తున్న అతికొద్ది కుకింగ్ ఛార్జీలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1,170, వంట నూనె ధర లీటరు ప్యాకెట్ రూ.160, టమోటాలు కేజీ రూ.130, పచ్చిమిర్చి రూ.120, క్యారెట్ రూ.80, అల్లం రూ.220, వెల్లుల్లి రూ.120, ఎండుమిర్చి ధర రూ.260 ఉండడంతో మెనూ ప్రకారం వండి పెట్టడానికి మిడ్డే మీల్స్ వర్కర్లపై అదనపు భారం తప్పడం లేదు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర కుకింగ్ ఛార్జీలు ఏ మాత్రమూ సరిపోని పరిస్థితుల్లో వారు అప్పులు చేయాల్సి వస్తోంది.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులు

విద్యార్థికి రూ.20 చొప్పున చెల్లించాలి

ఉదయం టిఫిన్ తినాలంటే రూ.30 నుంచి రూ.40 ఖర్చవుతోంది. అలాంటిది ఒక పూట భోజనానికి ప్రభుత్వం రూ.5.88 నుంచి రూ.8.57 మాత్రమే ఇస్తే ఎలా సరిపోతుంది. పెరిగిన గ్యాస్, నిత్యావసరాలు, కూరగాయల ధరల దృష్ట్యా ప్రతి విద్యార్థికీ రూ.20 చొప్పున కుకింగ్ ఛార్జీలు ఇవ్వాలి.

- నర్ల ఈశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి, మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్, కాకినాడ

కష్టంగా నిర్వహణ

ధరలు విపరీతంగా పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచడం లేదు. మాపై అదనపు భారం పడుతోంది. కొన్నేళ్ల క్రితం ఇచ్చిన వంట పాత్రలు పాడయ్యాయి. మా సొంత డబ్బులతోనే వంట పాత్రలు కొనుగోలు చేసుకున్నాం. అదనంగా రాగి జావ కూడా తయారు చేస్తున్నా వంట ఖర్చులకు అదనంగా ఒక రూపాయి కూడా ఇవ్వడం లేదు.

- డి.సుబ్బలక్ష్మి, మిడ్డే మీల్స్ వర్కర్, జి.మామిడాడ పెదపూడి మండలం

శ్రీవారి దర్శనానికి 18గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుంది. శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో రద్దీ పెరిగింది. 23 కంపార్ట్‌మెంట్లు యాత్రికులతో నిండిపోయాయి. టోకెన్లు లేని యాత్రికులు సుమారు 18 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. 63,932 మంది యాత్రికులు శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా రూ.4.13 కోట్లు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

అవార్డుతో చిన్నారి ప్రజ్వల్

కడప చిన్నారికి అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లాకు చెందిన ఆరు నెలల చిన్నారి అంతర్జాతీయ అవార్డు సాధించాడు. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన పవన్‌కుమార్, సౌమ్య ప్రియ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. జంతువులు, పండ్లు, వాహనాలు, అంకెలు, పక్షులు, కూరగాయల ఫొటోలను చూపించి వాటి పేర్లను కుమారుడికి తల్లి నేర్పించేవారు. బుడతడు అన్ని పేర్లను గుర్తించుకుని, టక్కున సమాధానం చెప్పేవాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఈ నెల 19న నోబెల్ వరల్డ్ రికార్డ్ సంస్థకు తల్లిదండ్రులు పంపారు. పరిశీలించిన నిర్వాహకులు ఆ చిన్నారి ప్రతిభను మెచ్చి ఈ నెల 29న ఆన్‌లైన్ ద్వారా అవార్డు అందించారు. కుమార్తె వినీష కూడా నాలుగేళ్ల వయస్సులోనే ఐదు అవార్డులు సాధించిందని తల్లిదండ్రులు తెలిపారు. ప్రజ్వల్ తండ్రి వస్త్ర వ్యాపారి, తల్లి గృహిణి.

మాజీ మంత్రి నారాయణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నారాయణపై హైదరాబాద్ రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. కుటుంబ సభ్యులు కొన్నేండ్ల నుంచి తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నా రని నారాయణ తమ్ముడి భార్య ప్రియా పొంగుళూరు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా బావ నారాయణ తనను మానసికంగా హింసిస్తూ.. శారీరకంగా వాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్టు ఆమె మీడియాకు తెలిపారు. ఇదిలా ఉంటే, ఈ విషయంపై కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తనకు జరిగిన అన్యాయంపై ప్రియా పొంగుళూరు సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. దాన్ని ఆమె భర్త ఖండిస్తూ పోస్టు చేశాడు. ఈ క్రమంలో ఆమె రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

దేశవ్యాప్తంగా చేనేతలు ఐక్యమవ్వాలి

- డబ్ల్యుడబ్ల్యుఒ వ్యవస్థాపక సభ్యులు రమేష్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

దేశవ్యాప్తంగా చేనేతలు ఐక్యం కావాలని వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుడబ్ల్యుఒ) వ్యవస్థాపక సభ్యులు మునుకుంట్ల రమేష్ కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో రమేష్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో దేశ వ్యాప్తంగా ఉన్న చేనేతలను ఆదుకునేందుకు డబ్ల్యుడబ్ల్యుఒను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యకు అవసరమైన సహాయ సహకారాలపై ఈ సదస్సులో చర్చిస్తామని, సభ్యుల అభిప్రాయాల మేరకు నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో పేద చేనేత కుటుంబాలకు సహకారం అందిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో చేనేత సామాజిక తరగతికి సంబంధించి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరన్నారు. శాసనసభ, పార్లమెంట్‌లో చేనేతలకు ప్రాధాన్యత పెరిగే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. దీంతో చేనేత రంగ సమస్యలు చట్ట సభల్లో వినిపించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అంతర్జాతీయంగా ఎన్ఆర్ఐల సహాయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక చైర్మన్ కె అంజన్, వ్యవస్థాపక సభ్యులు ఎ రాజ్, ఎబిపిఎస్ అధ్యక్షులు కె స్వామి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, ఎల్ రమణ, పి అనురాధ, మురుగుడు హనుమంతరావు, కర్నూలు ఎంపి ఎస్ సంజీవ రాయుడు, మధ్యప్రదేశ్ ఐఎఎస్ అధికారి పి నరహరి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బి సురేంద్ర, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జి విజయలక్ష్మి, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సదస్సు తీర్మానాలు

చేనేత సామాజిక వర్గాలకు అన్ని రాజకీయ పార్టీలు చట్ట సభల్లో తగినన్ని సీట్లు కేటాయించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శాసనసభ స్థానాలు చీరాల, మంగళగిరి, రాజమండ్రి రూరల్, ఎమ్మిగనూరు, వెంకటగిరి, ధర్మవరం, గాజువాక, పిఠాపురం, పార్లమెంట్ స్థానాలు హిందూపురం, కర్నూలు, రాజమండ్రి కేటాయించాలని పేర్కొంది. చేనేత ఉత్పత్తులపై, చిలపల నూలుపై జిఎస్‌టి పూర్తిగా తొలగించాలని, నేషనల్ హ్యాండ్లూమ్ బోర్డ్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ చేనేత సంస్థలను పునరుద్ధరించాలని, 1985 చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని, చేనేత సహకార సంఘాల బకాయిలు వెంటనే చెల్లించి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని సదస్సులో తీర్మానించారు.

సదస్సులో మాట్లాడుతున్న డబ్ల్యూ డబ్ల్యూ ఒ వ్యవస్థాపక సభ్యులు ఎం రమేష్

'వంశధార'లో రైతు గల్లంతు

- గుర్రపుడెక్క తొలగింపునకు కాలువలో దిగి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయిన వైనం
- నిర్వహణకు రెండేళ్లుగా నిధులు ఇవ్వని ఫలితం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార కాలువల నిర్వహణలో ప్రభుత్వ ఉదాసీనం ఓ రైతు గల్లంతుకు దారితీసింది. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగించేందుకు నిధులు కావాలని అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఈ నెల 29న పోలాకికి చెందిన పదిమంది రైతులు స్వయంగా కాలువల్లోకి దిగి గుర్రపుడెక్క తొలగించుకునే పని మొదలుపెట్టారు. కాలువల్లో నీటి ఉధృతికి ముప్పిడి శాంతారావు (62) అనే రైతు గల్లంతయ్యారు. రెండు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసులు, రెవెన్యూ శాఖ ప్రస్తుతం గాలింపు చర్యలు చేపడుతున్నాయి. గుర్రపుడెక్క కోసం దిగి గల్లంతయ్యారంటే ప్రభుత్వానికి అప్రతిష్ట అని భావించిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతైనట్లుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార కాలువల్లోని నీరు కాలువను ఆనుకుని ఉన్న పొలాలను ముంచెత్తింది. గుర్రపుడెక్క తొలగిస్తే నీరు కిందికి పోయి తమ పంటను కాపాడుకోవచ్చని భావించిన రైతులు కాలువలోకి దిగారు. ఈ క్రమంలోనే నీటి ఉధృతికి రైతు కొట్టుకుపోయారు.

సకాలంలో నిధులు విడుదల చేసి ఉంటే...

వంశధార కుడి, ఎడమ కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. వీటి తొలగింపునకు నిధులు కావాలంటూ వంశధార ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి రెండేళ్ల కిందటే రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు ఆ ఫైల్‌కు మోక్షం లభించలేదు. శివారు భూములకు నీరందడం లేదని రైతుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు రావడంతో గతేడాది కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రూ.40 లక్షలు కేటాయించారు. వాటితో పాక్షికంగా తొలగించారు. ఈ సంవత్సరానికి సంబంధించి వారం రోజుల కిందట మరో రూ.50 లక్షలు విడుదల చేశారు. వేసవి సీజన్‌లోనే తొలగింపు పనులు చేపట్టాల్సి ఉన్నా, ఆలస్యంగా నిధులు ఇవ్వడంతో ఇప్పటివరకు పనులు జరగలేదు.

రెండేళ్ల కిందటే ప్రతిపాదనలు పంపాం

వంశధార కుడి, ఎడమ కాలువల్లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపునకు ప్రభుత్వానికి రెండేళ్ల కిందటే ప్రతిపాదనలు పంపాం. జిల్లాలో అందుబాటులో ఉన్న నిధులతో గతేడాది తాత్కాలికంగా పనులు చేపట్టాం. ఈ సంవత్సరం ఇంకా పనులు ప్రారంభించాల్సి ఉంది.

- దోల తిరుమలరావు, వంశధార సర్కిల్ ఎస్ఇ

రూ.10 వేల కోట్లు కేటాయించండి

- ఎపి గొర్రెల మేకల పెంపకందారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గొర్రెల మేకల పెంపకందారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఎపి గొర్రెలు మేకలు పెంపకం దారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గొర్రెల మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి పెంపకందారునికి 50శాతం సబ్సిడీతో రూ.5 లక్షల దాకా రుణాలను ఇవ్వాలని కోరారు. గొర్రెల సహకార సొసైటీలకు యన్‌సిడిసి కింద రూ.88 కోట్ల నిధులను విడుదల చేయాలని, 90శాతం సబ్సిడీతో ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మించాలని, 50 సంవత్సరాలు నిండిన పెంపకందారులుకు పించన్లను, అన్ని గొర్రెలు, మేకలకు ఉచిత ఇన్సూరెన్స్ ద్వారా పశునష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశు వైద్యులు, ఆర్‌బికెలలో సిబ్బంది ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని, గొర్రెల, మేకల సంఖ్యకు అనుగుణంగా అన్ని రకాల టీకాలు, మేలు రకం విత్తన పొట్టేళ్లను సరఫరా చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 31న విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద జరిగే ఆందోళన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెంపకందారులు తరలిరావాలని కోరారు.

అప్పుల్లో అగ్రభాగాన ఎపి : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిజర్వ్ బ్యాంక్ నుంచి అప్పుల జాబితాలో అగ్రభాగాన ఆంధ్రప్రదేశ్ ఉందని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ నుంచి జులై వరకు నాలుగు నెలల్లో ఆర్‌బిఐ నుంచి రూ.29,500 కోట్లు అప్పు చేసి దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందని, మొదటి స్థానంలో తమిళనాడు ఉందని అన్నారు. రాష్ట్రానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఉన్న రుణ పరిమితి రూ.30,275 కోట్లలో ఇప్పటికే 97.4శాతం వాడుకున్నామని తెలిపారు. ఒక్కపైసా కూడా అభివృద్ధికి ఖర్చు చేయలేదని, అందుకే రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. విదేశీ విద్యను జగన్ సర్వనాశనం చేశారని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి బుచ్చిరామ్ ప్రసాద్ మరో సమావేశంలో విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు విదేశీ విద్యను చంద్రబాబు ప్రభుత్వం అందరికీ అందేలా చేసిందన్నారు.

గతేడాది కంటే తక్కువే!

- పెరగని జలశయాల నీటిమట్టాలు
- శ్రీశైలం, తుంగభద్రలో వరద అంతంత మాత్రమే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శ్రీశైలం, తుంగభద్ర జలాశయాల్లో నీటి మట్టాలు పెరగడం లేదు. గతేడాది కంటే చాలా తక్కువ స్థాయిలో నీటి మట్టాలు నమోదయ్యాయి. జూరాల, హంద్రీ, సుంకేసుల ద్వారా మొత్తంగా శ్రీశైలానికి 82.055 క్యూసెక్కులు, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్రకు 48,058 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయంలో విద్యుదుత్పత్తి పేరుతో అటు తెలంగాణ, ఇటు ఎపి ప్రభుత్వాలు ఇష్టానుసారంగా నీటిని తోడేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. పదేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. కీలకమైన సమయంలో సాగు నీరందక ఇరు రాష్ట్రాల రైతులూ ఆందోళన చెందుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు. ప్రస్తుతం 846.70 అడుగులు ఉండగా... గతేడాది ఇదే సమయానికి 881.60 అడుగుల నీటి మట్టం నమోదైంది.

పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టిఎంసిలు. ప్రస్తుతం 73.2313 టిఎంసి ఉండగా... గతేడాది ఇదే సమయానికి 196.5611 టిఎంసిల నీటి నిల్వ ఉన్నాయి. ఏటా ఈ ప్రాజెక్టులో నీటిమట్టం 854 అడుగులు, నీటి నిల్వ 53 టిఎంసిలు మెయింటెన్ చేయాలని బచావత్ ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ, రాష్ట్ర విభజన సమయం నాటి నుంచి ఏ యేడాదీ ఈ సీజన్లో 854 అడుగుల నీటిమట్టం లేదు. ఏటా 600 టిఎంసిల నుంచి 2 వేల టిఎంసిల వరకూ వరద నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. రాయలసీమ ప్రాంత పరిధిలో కృష్ణా నది వెంట ఎక్కడా రిజర్వాయర్లు లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. శ్రీశైలం డ్యామ్ నీటి నిలువ డెడ్ స్టోరేజీకి పడిపోతే జీవరాశులకు నీటి లభ్యత తగ్గిపోతుంది. దీంతోపాటు వాతావరణం వేడెక్కి పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. శ్రీశైలం జలాశయంపై ఆధారపడి రాయలసీమలోని గాలేరు నగరి, తెలుగుగంగ, హంద్రీనీవా, కెసి కెనాల్, ఎస్ఆర్‌బిసి కింద లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు కర్ణాటక రాష్ట్రంలో ఇప్పటి వరకు మంచి వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర డ్యాం వెలవెలబోతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా ప్రస్తుతం కేవలం 74.003టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. గతేడాది ఇదే సమాయానికి నీటి నిల్వ 104.905 టిఎంసిలుగా ఉంది. జలాశయ గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు కాగా, ప్రస్తుతం 1624.80 అడుగులుగా నీటి మట్టం ఉంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటి మట్టం 1632.78 అడుగులుగా ఉంది. దీంతో ఈ ఏడాది ఎల్ఎల్‌సి కింద వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది.


శ్రీశైలంలో నిల్వ ఉన్న నీరు

రాష్ట్ర ప్రభుత్వ దాష్టీకాలను దీటుగా ఎదుర్కోవాలి : దగ్గుబాటి పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ దాష్టీకాలను దీటుగా ఎదుర్కోవాలని, న్యాయపరమైన సమస్యలు వచ్చినప్పుడు కార్యకర్తలుగా అండగా నిలబడాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆర్‌టిఐ సెల్, లీగల్‌సెల్ సంయుక్త సమావేశంలో ఆమె మాట్లాడారు. మైనింగ్ మాఫియాపై లీగల్‌సెల్, ఆర్‌టిఐ సెల్ సంయుక్త పోరాటం చేయాలని అన్నారు. ఓటర్ల లిస్టులో ఓట్ల తొలగింపు అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ సమావేశంలో బిజెపి లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనరు ప్రతాప్‌రెడ్డి, ఆర్‌టిఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్ ఎల్ ఎస్ మూర్తి

లౌకిక విధానానికి ఏకరూప పౌరస్మృతి గొడ్డలిపెట్టు

- ఐలు రాష్ట్ర నాయకులు సిహెచ్ ఎల్ ఎస్ మూర్తి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

లౌకిక విధానానికి ఏకరూప పౌరస్మృతి గొడ్డలిపెట్టు అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర నాయకులు సిహెచ్‌ఎల్‌ఎస్ మూర్తి తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ కార్యాలయంలో ఏకరూప పౌరస్మృతిపై ఆదివారం సెమినార్ జరిగింది. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌కు ప్రముఖ న్యాయవాది బి సలీం అధ్యక్షత వహించారు. సెమినార్‌లో సిహెచ్‌ఎల్‌ఎస్ మూర్తి మాట్లాడుతూ.. యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని దేశ భవిష్యత్తు అభివృద్ధిలో ముందుకెళ్తుందని మతోన్మాదులు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దీనిని తిప్పికొట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల్లో చరిత్ర కనుమరుగయ్యే విధంగా కొత్త పాఠ్యపుస్తకాలు తయారు చేస్తు న్నారన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడపాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగానికి లోబడి పరిపాలన చేయకుండా, కాషాయీకరణ పరిపాలన చేస్తోన్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని పాలించే హక్కు లేదన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తోన్న అరాచకాలను, దాడులను రాజకీయాలకతీతంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ మస్తాన్‌వలి, గిరిజన రాష్ట్ర నాయకులు కోటా నాయక్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాహనాలను అడ్డుకున్న నిర్వాసిత గ్రామ యువకులు

మూలపేట పోర్టు వాహనాలు అడ్డగింత

ప్రజాశక్తి - నౌపడ

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేటలోని గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి రాళ్లు, గ్రావెల్, సిమెంట్ మెటీరియల్‌ను తరలిస్తున్న వాహనాలను నిర్వాసిత గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. నౌపడ నుంచి మూలపేట వరకు ఉన్న ఇరుకు రోడ్ల మీద భారీ వాహనాలు ప్రయాణిస్తుండడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూలపేటకు వెళ్లే దారిలో రెండు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని వాటికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని నిర్వాసితులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నిర్వాసితుల గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించి, వాహనాలకు దారి ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.4362 కోట్ల వ్యయంతో 24 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేశారు. ఎపి మారిటైమ్ బోర్డు ఆధ్వర్యాన విశ్వసముద్ర కాంట్రాక్టు సంస్థ పోర్టు పనులను ముమ్మరం చేసింది.

మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

మహిళా సంరక్షణ కార్యదర్శులకు వార్షిక ఇంక్రిమెంట్లు

- జీఓ నెంబరు 59ని ఉపసంహరించుకోవాలి
- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళా సంరక్షణ కార్యదర్శులకు వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఎపి జెఎసి అమరావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం, ఎపి జెఎసి అమరావతి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసుగా పేర్కొంటూ ప్రభుత్వం 2023.06.23న ఇచ్చిన జీఓ నెంబరు 59ని, అలాగే పోలీసు విధులను కూడా ఉపయోగించుకునేలా హోమ్‌శాఖ ఇచ్చిన ఉత్తర్వులు జీఓ నెంబరు 2నుంచి మినహాయింపునిచ్చేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ మహిళా కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయసహకారాలు అందించేందుకే ప్రభుత్వం మహిళా సంరక్షణ కార్యదర్శుల వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. మహిళల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహిళా సంరక్షణ కార్యదర్శులకు సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.ఆరలయ్య పాల్గొన్నారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
హెడ్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015,
CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

అనుబంధం-4
స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అదికారి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినయోగించుకొని, అధీకృత అధికారిచేత డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలను/హామీదారులును సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/హామీదారులకు తెలియజేయునది ఏమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూలు 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనంచేసుకున్నారు.** సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్ట యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. ప్రత్యేకించి రునగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్‌కు ఇందు దిగువ పేర్కొన్నట్లు మొత్తాలను దానిపై వడ్డీతోసహా చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీతలు / హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు తేది & మొత్తాలు	స్వాదీనతా తేది
1	1) శ్రీ గూడూరు వి ఎన్ జగదీశ్వర రావు, తండ్రి భాస్కర రావు, 2) శ్రీమతి గూడూరు లక్ష్మి దుర్గ, LAN NO. :AP/VWD/ELRU/A000000001 రూ. 13,76,675/- (రూపాయలు పదమూడు లక్షల డెబ్బై ఆరు వేల ఆరు వందల డెబ్బై ఐదు మాత్రమే) ఇరువురి నివాసం: ఇ.నం.1-29, పల్లెవాడ, కైకలూరు, కృష్ణా జిల్లా, ఏ.పి.-521340.	13.04.2023, 13.04.2023 నాటికి వడ్డీతోసహా రూ.13,76,675/-	26-07-2023
	సెక్యూర్డ్ అసెట్ (స్థిరాస్తి) వివరణ: కృష్ణా జిల్లా, ఎస్ఆర్ఒ కైకలూరు పరిధిల్లోని ఆస్తి యొక్క 242.0చ.గ.లు లేదా 202చ.మీ.ల విస్తీర్ణంతో కృష్ణా జిల్లా, కైకలూరు మండలం, పల్లెవాడ గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.267/12 లోగల ఆస్తి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: జి. తారక వెంకట నాగ రాం చంద్రారావు ఆస్తి, దక్షిణం: ఎ. ఆంజనేయ నాయుడు ఆస్తి, పడమర: జి. కృష్ణ మూర్తి ఆస్తి, ఉత్తరం: నాగ శ్రీను వర ప్రసాద్ ఆస్తి.		

ప్రదేశం: విజయవాడ తేది: 31.07.2023 శ్రీ ఎం. రామకృష్ణ మూర్తి, (అధీకృత అధికారి), హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 31 జులై 2023

రాజకీయ, సామాజిక, ఆర్థిక
రంగాల్లో మహిళ అభివృద్ధి
సాధించనంత వరకూ సామాజిక
భద్రత రాదు. అందునా
పురుషాధిక్యత ఉన్న సమాజం
గనుక మహిళలు ఉద్యమించాలి.

- వి.ఐ.లెనిన్

భరతమాతా, క్షమించు ...

బట్టలు కట్టిన దేశం విలువెంత?
బట్టలు లేని దేహపు విలువెంత?
అసలు దేహపు విలువెంత?
దేహాలను నగ్నంగా నడిపించే దేశపు విలువెంత?
ఏమో, ఎవడికెరుక ?
మన దేశంలో రోజుకో రాచపుండు కనుక !

దేహం దేశం చుట్టూ
దేశం దేహం చుట్టూ కాలుతున్న
ఈ మణిపూర్ మంటల్లో
బూడిదయ్యేది మాత్రం సామాన్యులే!
కలత చెందింది మాత్రం భారతీయులే ...
స్త్రీలపై జరిగిన ఈ దాడిలో
బూడిదయ్యింది మానవత్వమే కదా...

దేశపు రక్షణ దేహపు రక్షణ
దుర్మార్గపు మతోన్మాద దాడి భక్షణవుతుంటే...
ప్రధాని స్పందన ఖరీదు 36 సెకండ్లు...
నిజమే మనది ఎంత గొప్ప దేశమో ...
సమస్యను సనాతనం మీదికి రుద్దే
కసాయి మూకలకు ఓ నమస్కారం !
జరిగిన ఘోరానికి
కదిలే మనసున్న ప్రతి మనసు శిక్షకు గురైనది
భరతమాత నీకు బట్టలున్నాయా ...
రాకూడని సందేహం నాకు వచ్చినందుకు
తల్లీ, నన్ను క్షమించు...!

- అభిరామ్
97041 53642

కాగడాలై కదులుతున్నాం!

లోయల్లో మీరు
మాయల పకీరుల్లా
కొండమేకల్ని పట్టుకొని
కొట్టుకు తింటున్నారు
కోరిక తీర్చుకుంటున్నారు
మేము ఆదివాసీలము
అడవితల్లి బిడ్డలం
కొండకోనల్లో బతికే కుకీలం
మీ ఆగడాలకు అదుపే లేదు
కాగడాలై కదులుతున్నాం
మీ కళ్ళల్ల బియ్యంపొయ్యడానికి
మీ కండకావరం కాల్చడానికి ...

• • •

మీకు మతం పిచ్చి పట్టుకుంది
మన్యం మీద కళ్ళు బడ్డాయి
మీ మూకల్ని మా మీదికొదిలి
మా పీకల్ని కోస్తున్నారు
శిలువ మందిరాలను
చిందర వందర చేస్తున్నారు
మా గుడిసెల మీద
ఏనుగులై పడిపోయి
పీనుగుల్ని చేస్తున్నారు
కాగడాలై కదులుతున్నాం
మీ కాటిల కంపలెయ్యడానికి
మీ పోత్రం బొమ్మల్లించడానికి ...

• • •

తెలిసిపోయింది
ప్రపంచానికి మీ కుటిల నీతి
రోజు రోజుకూ
వెలిసిపోతంది నీ రాజనీతి
ఒక్కసారి నిన్ను నువ్వు
అద్దంలో చూసుకో
నిన్ను కన్నది ఆడదని తెలుసుకో
కాగడాలై కదులుతున్నాము
నీ నులుపు తీసి పలుపులెయ్యడానికి
నీ పొగరు తీసి పొంగడాలు ఒండదానికి ...

• • •

మీము ఆడోల్లం అపర కాలికలం
దారిపొడుగునా వన మూలికలం
దారి చెరపాలనుకుంటే
దూలగుండు మొక్కలం
మీము
నెయ్యానికి స్వాగతం పలికితే
మీరు
కయ్యానికి కాలు దువ్వుతున్నారు
కాగడాలై కదులుతున్నాము
మీ ఆటలింక సాగవు
కదిలింది కందిరీగల దండు.

• • •

పరాయి ఆడోళ్ళ
పరువు తియ్యాలనుకుంటే
రావణాసురుల్లా
మీకు రాకతప్పదు చావు
మా కోపానికి మీరు
శాపగ్రస్తులవ్వడం న్యాయం
మా కంటిముందల మీరు
చంటిపిల్లలవ్వడం ఖాయం
ఏ మతగ్రంథం తిరగేసినా
చెడ్డవాళ్లకు చావే ఆఖరి గతి !

- చింతా అప్పల నాయుడు
9441713185

నెత్తురు మరిగిన పులులు

నెత్తుటి మరకల చరిత్రను లిఖించడం
వాళ్ళకు కొత్తేం కాదు
నరమేధం సృష్టించడం
వాళ్ళ మేధలో ఎప్పుడూ నిక్షిప్తమై ఉన్నదే కదా!
మానవత్వం కంటే మతమే గొప్పదని
మతోన్మాదకణాల్ని నరనరాన ఎక్కించుకున్న
నిఖార్సైన పాలకులు కదా!
మంటల్ని రగిలించడం
కుత్తుకల్ని తెగ్గోయడం
అమానీయ రాక్షసత్వపు పునాదులపై
మనువాదాన్ని బతికించడం వల్లే కదా ...
వాళ్ళిప్పుడు దేశభక్తులు !
గోద్రా సజీవ దహనాలైనా
మణిపూర్ అత్యాచారాలైనా
హింసోన్మాదం నాగ్‌పూర్ చలి మర గదుల్లోంచి
పుట్టుకొచ్చినదే కదా
దేశం వాళ్ళకిప్పుడు యుద్ధ మైదానం
మనుషులకు, మతోన్మాదులకు మధ్య నడుస్తున్న
అరాచక సంగ్రామం!
వాళ్ళిప్పుడు వాళ్ళు కాని,
వాళ్ళ సమూహంలో లేని,
మనుషుల నెత్తురు మరిగిన పులులు..!

- కెంగార మోహన్
94933 75447

దేశం నగ్నంగా ...

ఈ ఉదయం
తెల్లారకపోతే బావుండు
నా దేశం చీకట్లో ఉందని
పోరాటం చేసే వాడిని!

ఈ క్షణం
సంకెళ్ళు సడలకుంటే బావుండు
బానిసత్వంలో వున్నానని
నాకు సర్దుకునేవాడిని

ఈ పురిటి నొప్పులు
ఇలాగే ఉండి పోతేబావుండు
కన్ను తెరవలేదని
కాలంతో తృప్తిగా కదిలే వాడిని

నా చూపు ఒట్టిపోతే బావుండు
నా ప్రపంచం గుడ్డిదని
సిగ్గు విడచిన చరిత్రకు
జీవశ్చవమై జవాబిచ్చే వాడిని!

నగ్నంగా నడిచింది నీవు కాదు
వంద కోట్ల భారతీయులం
నడివీధిలో జన్మ స్థానాన్ని నిలబెట్టి
మృగాలమై అడవిని గుర్తు చేశాం

నీ ప్రతి కన్నీటి బొట్టులో
మమ్ము మేము ప్రక్షాళన చేసుకోవాలి
నీ ప్రతి అడుగులో
మా అహంకారాన్ని పాతాళానికి దించుకోవాలి
మన్నించడానికి మేం బతికిలేం
మరణించి చాలా కాలమైంది
మారామని మనసుకొస్తే
మరోసారి మమ్మల్ని
పవిత్రంగా కంటావు కదూ!

- నల్లు రమేష్
99897 65095

దేశం ఎన్నడో తల దించుకున్నది

దేశం ఎన్నడో తల దించుకున్నది
ఈ రోజు మరోసారి... అంతే!
ఇంకోసారి తలదించుకోదన్న భరోసా కూడా ఏమీ లేదు
దాని తల ఎన్నడో ఎక్కడో ఎప్పుడో పెట్టుకున్నది!
మతం కుక్కిన మౌఢ్యంతో
మనుషుల బుర్రలు చెదలు పట్టి
దేశాన్ని దిసమొలతో నిరంతరం ఊరేగిస్తూనే ఉన్నారు

కాకపోతే ఇప్పుడు దేశం దేహం
మణిపూర్ కుకీ అయ్యింది
గతంలో ఈ దేహం పేరు ఖైర్లాంజీ
ఇంకా వెనక్కిపోతే – గుజరాత్
అంతకన్నా వెనక్కి పోతే – కారంచేడు
ఈ దేశపు అణువణువూ
అన్నను చెల్లిపై కొడుకును తల్లిపై
ఉసి గొలిపే వికృతానంద భరితం!

ఒక మతంపై మరో మతం
ఒక కులంపై మరో కులం
ఒక జాతిపై మరో జాతి
మారణకాండ జరిపే ఉన్మాద చరిత్ర ఈ దేశానిది
ఏ వ్యవస్థలూ ఇక్కడ బాధితుల పక్షం వహించవు
ఓట్లు రాబట్టుకోడానికి
సీట్లు గెలుచుకోడానికి
అధికార పీఠాలు అదిమి పట్టుకోడానికి
ప్రాంతాలు ఆక్రమించుకోడానికి
సంపదలు దోచుకోడానికి
ఆధిపత్యం నిరూపించుకోడానికి
పీడిత స్త్రీల దేహాలు ఇక్కడ
నగ్నంగా ఊరేగించబడుతుంటాయి
అసహ్యంగా చేతులతో తడుముతూంటాయి
అత్యాచారాలకు ఆలవాలమౌతుంటాయి!

పోలీస్, సైన్యం, న్యాయవ్యవస్థ
అన్నీ అంతే... ఎంతకు అంతే!

ఉరికే వేట మృగాలకు తిండిని విసిరేసినట్టు
రక్షణ కొరకు తమను ఆశ్రయించిన వారిని
ఉన్మాదులకు స్వయంగా అప్పగించేస్తుంటారు

మౌనం ఓ వ్యూహాత్మక కుట్ర !
మేలు కోవాల్సింది పీడిత జనమే ...
ఆయుధంగా మలుచుకోవాల్సింది మనల్ని మనమే!

- పి. మురళీకుమార్
9397873331

మన్నైనా కప్పండి !

మానప్రాణం వీడిన
మాంసపు ముద్దలవి
కాలుతున్న కొవ్వొత్తుల వెలుగులో
అ(తి)వమానం బూడిదవుతుందా
అవని గోడు ఆకాశానికి వి(క)నిపిస్తుందా?

రాతి వనంలో రగిలిన చిచ్చు
ఏలికల చెవిలో
సుప్రభాత ప్రవచనాలేనా?
నిమ్మకు నీరెత్తినట్లుగా
సముద్రంలోని మత్తునంతా తాగేసి
అవకాశపు దుప్పటి కప్పుకొని పడుకున్నారా?

కలాలూ గళాలూ
ప్రతిఘటిస్తున్నాయి..
అకృత్యపు క్రీడలతో
అరాచకాల దారిలో
అత్యాచారాల వేటలో
హింస వేటుకు
రాలిపడ్డ మాతృత్వాలు
రోదిస్తున్న గర్భశోకాలు
మీ అరాచక పాలనకు పరాకాష్ఠ!
వజ్రోత్సవాలు జరుపుకున్న
శిఖండిని చూసిన భీష్ముడిలా
మానాల అస్త్రాలపై పడి ఉంది తల్లి భారతి
చచ్చి బతుకుతూ బతికి చస్తూ
నెత్తుటి మడుగులో పడ్డ
శీలాలను హత్తుకొని ..

ఇంకా లెక్క సరిపోలేదేమో
మానాలు ప్రాణాలు ధారపోయండి
అవనినిండా అతివల శవాల పూలు
పరచండి
కులాలు మతాల ఏలికలు
పాదస్పర్శతో పావనం చేయండి
భారతావనికి సంపూర్ణ పరాభవం
జరుగుతుంది
అప్పుడు అధర్మమే రాజ్యపాలన చేస్తుంది
కాష్టం చేయకండి మన్నైనా కప్పండి
కొన్ని యుగాలకు అమ్మతనపు
చిగురులు పుట్టుకొస్తాయి
ఏ మార్పూ లేనప్పుడు కాస్త మన్నైనా
కప్పండి!

- స్వయంప్రభ
88975 52022

దుఃఖం పండుతున్న నేల

నిన్న మొన్నటి వరకు
నింగికెగిసిన కీర్తిపతాక
ఇప్పుడు అచ్చం మాపుగుడ్డలా వుంది
సూర్యుడు చంద్రుడు
మేకప్పులు మార్చుకునేంతలోపు
ఇక్కడ సన్నివేశాలు మారిపోతుంటాయి

దేవుడికి తెలియకుండానే
సంధించబడుతున్న బాణం
కొన్ని జాతుల చరితల్ని చెండుతుంటుంది
ఇంకొన్ని మూకలకు రక్షణ వలయమవుతుంది
మరి కదులుతున్న ఈ కొత్త పారాయణం
పాడుతున్న మాయా విద్వాంసుడిని
అజకట్టాల్సి వుంది

ఇక్కడ పసినవ్వులో రసికత వెతకబడుతుంది
ఇక్కడ పైచెయ్యి కోసం అల్లుడిపై
వజ్రాయుధం విరుచుకు పడుతుంది

ఇక్కడ నమ్మకం నమ్మించి మోసం చేస్తుంది
ఇక్కడ ఆలపించబడ్డ గేయాలన్నీ
గొంతు చించుకుంటున్న ఆర్తనాదాలే
ఇక్కడ తాపడం చేయబడ్డ బూతులన్నీ
నిఘంటువులెరగని నానార్థాలే !

స్త్రీలు గౌరవించబడ్డ దగ్గర దేవతలుంటే
హింసించబడ్డ దగ్గర దెయ్యాలుంటాయనేగా
ఇప్పుడీ దేశాన్ని దెయ్యాల కొంప అనాలేమో!
కంటిముందు కదలాడుతున్న
దృశ్య రహస్యాల వెనక నిజానిజాల్లోని
ఇజాఇజాలు ఎప్పటికీ బహిర్గత
రహస్యాలు

పువ్వులన్నీ కలిసి కూడగట్టుకున్న
తోట సౌందర్యానికి తానొక్కతినే
కారణమని
ఒక పువ్వు పదే పదే ఒట్రించడం
సహచర పువ్వు పరిమళంపై
దాడులకు తెగబడటం ఏ సిద్ధాంతం
ప్రకారం
సమధర్మమో తేల్చి చెప్పాలిప్పుడు ..!

రమారమీ
రెండు వందల కోట్ల కన్నుల నుంచి
కురుస్తున్న వానల సాక్షిగా
ఇప్పుడు దేశంలో దుఃఖం పుష్కలంగా
పండుతుంది!

- బంగార్రాజు కంఠ
85003 50464

తల్లులు కూలుతున్న వేళ ..!

దేశమంటే మూకలని మరోసారి రుజువైంది
మణిపురమా, మన్నించు తల్లీ!
తోకలూపుతున్న మూకల్ని కన్నది
ఈ గర్భమేనా?
పశ్చాత్తాపం కలుగుతున్నది!

ఈ దేహమెప్పుడూ ఓ ప్రయోగశాలే
ఆకలేసినప్పుడు పీక్కుతున్నదీ
కోపమొచ్చినప్పుడు మదపుటేనుగులా మీద కూర్చుని
పిడిగుద్దులతో తునాతునాకలు చేస్తున్నదీ
ఈ పేగుల నుంచి తెగిపడ్డ వాళ్ళేగా ...

మీసాలు మొలిచిన చేతులు
వికృతంగా అంగాంగం తడిమింది
పసి డొక్కలకి పాలు తాపిన రొమ్ముల్నే
ఒక తరం కోసం మరణశయ్యపై
అలంకరించుకున్న శవమయ్యిందీ మర్మావయవమే
ప్రజాస్వామ్యం రాచరికపు పట్టు పరుపుల మీద
యురేనియం చుక్కల్ని స్ఖలిస్తున్న పురుష ఋతువిది!

ఇంటికో దేవతా వస్త్రం ధగధగా మెరిసిపోతున్నది
పవిత్ర భారతదేశమా! గుడ్లు మిటకరించే ఉంచు
నడిరోడ్డు మీద నగ్నంగా నిలబడిందెవరో నీకు తెలుసు!
ఇప్పుడంతా బహిరంగమే
న్యాయ దేవత గంతలు విప్పేయండి
న్యాయమూర్తుల్లారా, మీ నల్ల గౌనులు
ఊరవతలకు విసిరి పారెయ్యండి!

నిండు సభలో ఎప్పుడో బట్టలూడదీశారు
ఇప్పుడు కొత్తగా చూడ్డానికేముంది
చోద్యం చూసిందీ
అమ్మల దిసమొలల్నే కదా
ఆ పొత్తి కడుపుల మీద
ఈ జాతిని కన్నప్పుడు వేసిన కుట్లుంటాయి
రెండు కాళ్ళ మధ్యన
విశ్వ మానవుడి పుట్టుక రహస్యాలు
దృశ్యాలు దృశ్యాలుగా కనబడతాయి

జీవ పరిణామ సిద్ధాంతం
ఇప్పుడెలాగూ పగలబడే నవ్వుతున్నది
పీలికలు పీలికలైన మనిషితనాన్ని
కాళ్ళకు కత్తులు కట్టి బరిలోకి దింపారు
తెగనరికిన తలలు దళ్ళకి వేళ్ళాడుతూనే ఉన్నాయి
మా వొంటిపై జెండా శిధిలావస్థలో ఉన్నది
అమ్మలవి పూల గుండెలు కానీ
మీరందులో బాక్సైట్ వెతుకుతారు!

అయ్యలారా ...
ఆ కొండల మీద దీన జనుల కోసం
ఏడుపు ముఖం పెట్టకండి
మీ కుటుంబం కోసం మీ ఆడవాళ్ళ కోసం
ఏడవండి
మర్చిపోయిన మీ జన్మస్థానం గురించి ఏడవండి
మనిషి జాతినంటినీ ప్రపంచానికిచ్చిన
అవయవమే
ఇప్పుడో హింసాస్థలి ...

తల్లుల్లారా, చాలిక
కత్తులు ఒంటి నిండా కప్పుకుని తిరుగుదామిక!

- వైష్ణవి శ్రీ
80742 10263

విష సంస్కృతికి విరుగుడు రావిశాస్త్రి 'తిరస్కృతి'

సందర్భం

రావి శాస్త్రిగా ప్రఖ్యాతి చెందిన రాచకొండ విశ్వనాధ శాస్త్రి గొప్ప కథా, నవలా రచయిత మాత్రమే కాదు; గొప్ప నాటక రచయిత కూడా! సమాజంలోని చెడును చీల్చి చెండాడుతూ, మహిళా అభ్యుదయాన్ని కాంక్షిస్తూ 1956లో ఆయన 'తిరస్కృతి' అనే నాటిక రాశారు. ఇది 'వచ్చే కాలం' పేరుతో 1957లో 'భారతి' మాస పత్రికలో వెలువడింది. 1964లో 'తిరస్కృతి' పేరుతో పుస్తకంగా వచ్చింది.

'తిరస్కృతి' నాలుగు అంకాల నాటిక. ఇందులో కామేశ్వరికి జరిగిన మోసాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని రాశారు. స్త్రీలు సొంతంగా ఆలోచించి తమ నిర్ణయాలు తామే తీసుకొని జీవితాలు బాగు చేసుకోవాలని సందేశం ఇచ్చారు. గురజాడ కూడా ఇదే అభిప్రాయాన్ని 'కన్యాశుల్కం'లో వెలుబుచ్చారు. గురజాడ వారసుడు రావిశాస్త్రి. పెట్టుబడిదారీ వ్యాపార విష సంస్కృతి క్రమక్రమంగా సమాజంలో పెరిగిపోయింది. దీనివల్ల బడా ధనవంతులకు శ్రమ విలువ తెలియకుండా పోయింది. మానవ సంబంధాలను కూడా డబ్బుతో ముడిపెట్టారు. ఇలాంటి నీచమైన సంప్రదాయం మంచిది కాదని, సమాజాన్ని జాగృతి చేయడం కోసమే రావిశాస్త్రి ఈ నాటిక రాశారు.

ఇతివృత్తం : బడా పారిశ్రామికవేత్త రమణయ్య దగ్గర సెక్రటరీగా చంద్రశేఖర్, గుమస్తాగా కుటుంబయ్య పని చేస్తారు. కుటుంబయ్య, కొడుకు చనిపోతాడు. దు:ఖంలో వున్న అతన్ని పరామర్శించడానికి చంద్రశేఖర్, కుటుంబయ్య స్నేహితుడు, ఉపాధ్యాయుడైన సోమనాథం వస్తారు. ధైర్యంగా వుండమని ఇద్దరూ ఓదార్చుతారు.

సోమనాథం తన కూతురు పెళ్ళికి, రమణయ్య దగ్గర రూ.500లు అప్పు ఇప్పించమని చంద్రశేఖరును అడుగుతాడు. అతడు సోమనాథాన్ని రమణయ్యకు పరిచయం చేస్తాడు. అయితే, రమణయ్య అప్పు ఇవ్వకపోగా, సోమనాథాన్ని అవమానిస్తాడు. ఆత్మాభిమానం గల సోమనాథం అదే స్థాయిలో జవాబిస్తాడు. రమణయ్య రెండో కొడుకు మోహన్‌బాబు. అదే సమయంలో కుటుంబయ్య కూతురు కామేశ్వరి వచ్చి మోహన్‌బాబు వల్ల తాను గర్భవతి అయ్యానని చెబుతుంది. తమ యిద్దరికి పెళ్ళి చేయమని వేడుకుంటుంది. మోహన్‌బాబు తనకు కామేశ్వరి ఎవరో తెలియదని బుకాయిస్తాడు. తనకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదని కామేశ్వరి ఆవేదన చెందుతుంది. చంద్రశేఖర్ జోక్యం చేసుకొని, మోహన్‌బాబుని పెళ్ళికి ఒప్పిస్తానని, ఏ అఘాయిత్యం చేయవద్దని చెప్పి, కామేశ్వరిని ఇంటికి పంపిస్తాడు. అప్పుడే రమణయ్య పెద్ద కొడుకు అమెరికాలో చనిపోయాడని టెలిగ్రాం వస్తుంది. రమణయ్య తీవ్ర అస్వస్థతకు గురవుతాడు. ఆరోగ్యం కుదుటపడ్డాక– మోహన్‌బాబు, కామేశ్వరికి చేసిన మోసం గూర్చి చంద్రశేఖర్ తెలియజేస్తాడు. తరువాత చంద్రశేఖర్ తాను పార్టీ ఇస్తున్నట్లు మోహన్‌బాబుకు చెప్పి లాడ్జికి రప్పిస్తాడు. అక్కడే వేరే గదిలో కామేశ్వరి వుండేటట్లు ఏర్పాటు చేస్తాడు. మోహన్‌బాబుతో మాటల సందర్భంలో పెళ్ళి ప్రస్తావన తెస్తాడు. మోహన్‌బాబు పెళ్ళికి ఒప్పుకోడు. చివరకు అందరూ కలిసి మోహన్‌బాబుని ఒప్పిస్తారు. ఇదంతా విన్న

కామేశ్వరి... "ఇంత బలవంతాన పెళ్ళాడిన వీడితో నా బతుకెలా తెల్లారుతుంది" అని తిరస్కరించి, అక్కడ నుంచి వెళ్ళిపోతుంది. పెళ్ళి జరిగిపోయిందనే ఆనందంతో లాడ్జికి వస్తాడు రమణయ్య. విషయం తెలుసుకొని బాధపడతాడు. దీంతో నాటిక ముగుస్తుంది.

శిల్పం : కుటుంబయ్య కుమారుడు చనిపోయాడన్న సంఘటనతో నాటిక ప్రారంభమవుతుంది. కుటుంబయ్యను పరామర్శించడానికి సోమనాథం వస్తాడు. అతని మాటలు కుటుంబయ్యకు ఎంతో ఊరట కలిగిస్తాయి. కొండంత బలాన్ని ధైర్యాన్ని కలిగిస్తాయి. సోమనాథం మాటల ద్వారా రాబోయే కథా ప్రయోజనాన్ని ధ్వనింపజేస్తాడు రచయిత. సోమనాథం, కామేశ్వరి గూర్చి చంద్రశేఖర్‌తో మాట్లాడుతూ కుటుంబయ్యకు దూరపు బంధువైన రమణయ్య కొడుకు, కామేశ్వరిని పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని అంటాడు. అలాంటి వెధవలు ఇలాంటి మంచి అమ్మాయిని పెళ్ళాడరని అంటాడు చంద్రశేఖర్. మోహన్‌బాబు మంచివాడు కాడనే విషయం, మొదటి అంకంలోనే ధ్వనింపచేశారు.

రెండో అంకంలో జరగబోయే కథను సూచన ప్రాయంగా తెలియజేస్తారు. హార్బర్‌లో పనిచేసే తన కొడుకు జగన్నాధానికి కామేశ్వరి అంటే ఇష్టమనీ, సోమనాథం ద్వారా రచయిత చెప్పించడంలోని ప్రధాన ఉద్దేశం... రాబోయే రోజుల్లో ఆ రెండు పాత్రలు కలుసుకుంటాయని చెప్పడం. ఈ అంకంలోనే కామేశ్వరిని, మోహన్‌బాబు మోసం చేస్తాడు. మూడు, నాలుగు అంకాల్లో కామేశ్వరికి న్యాయం చేయడం కోసం అందరూ ఏకమవుతారు. బలవంతపు పెళ్ళి వద్దని తిరస్కరిస్తుంది కామేశ్వరి. ఈమెలో అభ్యుదయ భావాలు వుంటాయి. స్త్రీలు స్వంతంగా ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోవాలని రచయిత ఉద్దేశం. చివరలో "మనుషుల మంచి చెడ్డలు పట్టించుకోని మాకు, పోయేకాలమే కాని వచ్చేకాలం ఎక్కడిది" అని రమణయ్య చేత అనిపించటం ద్వారా నాటిక ప్రయోజనాన్ని సాధించారు రావిశాస్త్రి.

పాత్రలు : ఇందులో ప్రధానపాత్ర సోమనాథం. అందరూ క్షేమంగా వుండాలనీ, బాగుపడాలనీ కోరుకుంటాడు. సాటి మనిషికి సహాయం చేయడంలో ముందుంటాడు. తప్పు చేసిన వ్యక్తిని మందలించి, బుద్ధి చెప్పి, మంచిమార్గంలో నడిపించగల సత్తా వున్న వ్యక్తి. శత్రువును కూడా తనవైపు తిప్పుకోగల నేర్పరి. మానవతావాది. ఆత్మ గౌరవానికి భంగం కలిగితే, ఎదురు తిరిగే మనస్తత్వం కలవాడు సోమనాథం.

ఉద్యోగం చేస్తున్న యజమాని పట్ల గౌరవ భావంతో వుంటాడు చంద్రశేఖర్. అభ్యుదయ భావాలు గల వ్యక్తి. ఇతరులకు మేలు చేయాలనే విషయంలో అందరి కంటే ముందుంటాడు. కుటుంబయ్య బాధలో వున్నప్పుడు పరామర్శించి, ధైర్యం చెబుతాడు. అప్పు ఇప్పించే విషయంలో సోమనాథానికి సహాయం చేస్తాడు. కామేశ్వరి ఆత్మహత్య చేసుకోకుండా మనోధైర్యాన్ని కలుగజేస్తాడు. సమాజంలో చెడ్డవాళ్ళే కాదు మంచివాళ్ళు కూడా వుంటారని రచయిత ఈ పాత్రను సృష్టించారు.

పురుష అహంకారానికి బలైన స్త్రీ కామేశ్వరి. చివరకు ఆత్మహత్యే గత్యంతరమనే పరిస్థితికి వస్తుంది. సోమనాథం, చంద్రశేఖర్ చెప్పిన మాటల వల్ల ధైర్యం తెచ్చుకుంటుంది. మోహనబాబు బలవంతాన పెళ్లికి అంగీకరిస్తే– ఆ పెళ్లిని తిరస్కరించి, తన ఆత్మ గౌరవాన్ని చాటుకుంటుంది. మోహన్‌బాబు పరమ మోసగాడు. దుర్మార్గుడు. నీచుడు. చండాలుడు. నయవంచకుడు. విషసంస్కృతిలో పెరిగి పెద్దవాడవుతాడు. తండ్రి సంపాదించిన డబ్బుతో జల్సాలు చేస్తాడు. ఆడవాళ్ళ జీవితాలతో ఆటలాడుకుంటాడు. ఇక రమణయ్య తనకు డబ్బు వుందనే గర్వంతో వుంటాడు. ఇతరులను లెక్క చేయడు. పెద్ద కొడుకు చనిపోతాడు. చిన్నకొడుకు వ్యసనాలతో మునిగి తేలుతూ వుంటాడు. అంది వచ్చిన ఇద్దరు కొడుకులు ఇలా అయినందుకు తీవ్ర మనో వేదనకు గురవుతాడు రమణయ్య. నేను గొప్పవాడను, తిరుగు లేదనే పొగరు అణిగి, క్రమక్రమంగా దారిలోకి వస్తాడు. లేటుగా జ్ఞానోదయం అవుతుంది. రమణయ్యలో ఈ మార్పు రావడం, సమాజ మార్పులో భాగమే. రావిశాస్త్రి అదే కోరుకున్నాడు.

సమాజంలో మంచివారు చెడ్డవారు వున్నట్లే ఈ నాటికలో కూడా మంచి పాత్రలు, చెడ్డ పాత్రలు రెండూ ఉన్నాయి. ఇందులోని పాత్రలన్నీ సజీవమైనవే. అందుకే చలసాని ప్రసాద్ గారు రావిశాస్త్రిని "ది మోస్ట్ ఒరిజనల్ రైటర్" అన్నారు. సమాజంలో ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని బతకడానికి కామేశ్వరి నిర్ణయించుకుంటుంది. ఇదే అభ్యుదయానికి నాంది. స్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం, అన్నింటిని డబ్బుతో కొనవచ్చునన్న దుర్మార్గపు ఆలోచనలో వున్న ధనవంతుల మనస్తత్వాన్ని బట్టబయలు చేయడం, కష్టాలను ఎదుర్కొని నిజాయితీగా బతకడం, భవిష్యత్తు మీద ఆశాజనకంగా జీవించడం, సమాజంలో పాతుకుపోతున్న విషసంస్కృతిని రూపుమాపడం... మొదలైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రావిశాస్త్రి ఈ నాటిక రాశారు.

(నేడు రావిశాస్త్రి జయంతి)

- ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

బాల సాహిత్యానికి ఆదరణ ఎప్పటికీ ఉంటుంది!

సంభాషణ

డికె చదువుల బాబు

ఇటీవల బాల సాహిత్యానికి సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన సందర్భంగా డి.కె.చదువుల బాబుతో సంభాషణ టూకీగా....

సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం అందుకొన్న మీ అనుభూతి మాతో పంచుకోండి.

సంతోషంతో పాటు బాధ్యత కూడా పెరిగిందనిపించింది. చేయవలసింది చాలా ఉందనిపించింది. నేను వ్రాయడమేకాక రచనా మెలుకువలను వివరించి కొత్తతరాన్ని తయారు చేసే పనిలో ఉన్నాను. నూతన రచయితలను తయారుచేయాలనే దఢ సంకల్పంతో ఉన్నాను.

పూర్వం లాగా పిల్లల పత్రికలు ఎక్కువగా రావడం లేదు. బాలసాహిత్యం భవిష్యత్తు ఏమిటి?

ప్రత్యేకంగా పుస్తకాలు రాకపోయినప్పటికి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దిన, వార, మాసపత్రికల్లో బాలసాహిత్య రచనలను విరివిగా ప్రచురిస్తున్నారు. డజనుకు పైగా దినపత్రికకు ఆదివారం అనుబంధంగా వస్తున్న చిరు పుస్తకాల్లో కథలు వస్తూనే ఉన్నాయి కదా! తెలుగు రాష్ట్రాల్లో పిల్లలు వ్రాసిన పుస్తకాల సంఖ్య వందల్లో ఉంది. పిల్లలు చదివే స్థాయి నుండి వ్రాసే స్థాయికి ఎదుగుతున్నారు. బాల సాహిత్య భవిష్యత్తు ఉజ్వలంగానే ఉంటుందన్నే నా భావన.

పిల్లలు ఆండ్రాయిడ్ ఫోన్లు, ట్యాబ్లు చూస్తున్నారే తప్ప పుస్తకాలు చదవడంలేదు. పూర్వ వైభవం మళ్ళీ వస్తుందంటారా?

చదవని పిల్లలున్నట్లే, చదువుతున్న పిల్లలు కూడా ఉన్నారు. బాలసాహిత్యం విజ్ఞానానికి సోపానం. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతలు పిల్లలకు అనేక విషయాలు కథలరూపంలో చెప్పేవారు. గ్రంథాలయాల నుండి, ఇరుగు పొరుగు వారి నుండి పుస్తకాల తెచ్చుకుని చదవడాన్ని ప్రోత్సహించేవారు. ఆ పుస్తకాలు పిల్లల్లో సజనాత్మకతను, విచక్షణాశక్తిని పెంచేవి. సమాజంలో ఎలా నడుచుకోవాలో నేర్పేవి. నేడు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి, ఉరుకు పరుగుల జీవితంలో టి.వి, సెల్ ఫోన్ పిల్లల సమయాన్ని తినేస్తున్నాయి. పిల్లలను బాలసాహిత్యానికి దగ్గర చేయవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీద, ఉపాధ్యాయుల మీద ఉంది.

బాలసాహిత్యం విషయంలో మీ భవిష్య ప్రణాళిక ఏమిటి?

వ్రాయడమేకాక రచనా మెలుకువలను వివరించి కొత్తతరాన్ని తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాను. నా శిక్షణలో మా పాఠశాల విద్యార్థులు వ్రాసిన 20 కథలను 'కొత్తపేట కలాలు' పేరుతో ప్రచురించాను. నూతన పాఠకులను, రచయితలను తయారుచేయాలనే సంకల్పంతో ఉన్నాను.

- డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
9490400858

అహ్మదాబాద్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

- 125 మంది రోగుల తరలింపు

అహ్మదాబాద్ : గుజరాత్ అహ్మదాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. షాహీబాగ్ ప్రాంతంలో ఉదయం 4:30 గంటలకు 10 అంతస్తులతో ఉన్న రాజస్థాన్ ఆసుపత్రి భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో ఆసుపత్రి నుంచి సుమారు 125 మంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. బేస్‌మెంట్‌లో పార్క్ చేసిన ఉన్న ఒక నాలుగు చక్రాల వాహనం ధ్వంసమైందని చెప్పారు. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి ఉదయం 8 గంటల సమయానికి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఒక చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు.

జిఓ నెంబర్ 70, 71 రద్దు చేయాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులు తమ సమస్యలపై ప్రభుత్వాన్ని, యజమాన్యాన్ని ప్రశ్నించరాదనే జిఓ నెంబర్ 70, 71లను తక్షణం ఉపసంహరించుకోవాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్షకార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, కె అయ్యపరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మె ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అలాంటి హక్కులను నిర్వీర్యం చేసే ఈ జిఓలను ఉపసంహరించుకోవాలన్నారు. ఉద్యోగ, కార్మిక వ్యతిరేక చర్యల్లో భాగంగానే ప్రభుత్వం ఈ జిఓను విడుదల చేసిందని విమర్శించారు. ఇలాంటి జిఓలను గతంలో హైకోర్టు కొట్టివేసిందన్నారు. 1963లో రూపొందిన ఆర్‌టిసి నిబంధనలలో క్రమశిక్షణా చర్యలకు సంబంధించి 36 అంశాలు వుంటే ఇప్పుడు చిన్న చిన్న అంశాలను చేర్చి 54కు పెంచిందన్నారు. ప్రమాదాల విషయంలో ఎవరిది తప్పు వున్నా ఆర్‌టిసి డ్రైవర్‌దే తప్పు అన్నట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొనడం తగదని అన్నారు.

శాకాహారులే ఇక్కడ కూర్చోవాలి

- ఐఐటి బాంబేలో వివక్ష

ముంబయి : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) బొంబాయిలో మాంసాహారులపై వివక్ష వెలుగుచూసింది. క్యాంటీన్‌లో "శాకాహారులు మాత్రమే ఇక్కడ కూర్చోవాలి" అని రాసి వున్న పోస్టర్లను కొందరు విద్యార్థులు ట్విట్టర్‌లో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. హాస్టల్ క్యాంటీన్‌లో మాంసాహారం తిన్నందుకు ఓ విద్యార్థిని మరో విద్యార్థి అవమానించాడని, గత వారం హాస్టల్ 12లో ఈ ఘటన జరిగినట్లు కొందరు విద్యార్థులు తెలిపారు. మాంసాహారం తింటున్నామంటూ తమపై వివక్ష చూపుతున్నారని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ అమానవీయానికి అంతం ఎప్పుడు?

- దేశంలో 6,253 మంది మాన్యువల్ స్కావెంజర్లు!
- సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ యాప్ ద్వారా గుర్తింపు
- నేడు మంత్రిత్వ శాఖ సమావేశం

న్యూఢిల్లీ : ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నా.. దేశంలో ఇంకా మాన్యువల్ స్కావెంజర్ల వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం దేశంలో 6,253 మంది మాన్యువల్ స్కావెంజర్లు ఉన్నారని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక యాప్ గుర్తించింది. అయితే ఈ సంఖ్య ప్రామాణికమైనదా, కాదో తెలియదని సదరు మంత్రిత్వ శాఖ చెబుతోంది. జిల్లాల్లో మాన్యువల్ స్కావెంజింగ్ పరిస్థితిని సమీక్షించాలని ఇప్పటికే రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 31న మంత్రిత్వ శాఖ సమావేశం ఏర్పాటు చేసింది. మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధిని నిషేధించడం, వారికి పునరావాసం కల్పించాలనే చట్టం 2013ను పార్లమెంట్ ఆమోదించి పదేళ్లు గడిచినా ఇంకా మాన్యువల్ స్కావెంజర్ల గుర్తింపులోనే మంత్రిత్వ శాఖ ఉండటం విచారకరం. ఈ చట్టంలోని సెక్షన్ 2(1)(జి) ప్రకారం 'మాన్యువల్ స్కావెంజింగ్'ను 'అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్ల నుంచి మానవ మలాన్ని ఎత్తే వర్గం' నిర్వచించారు. ఈ చట్టం ఆమోదించిన ఏడు నెలల తరువాత 2014 మార్చిలో సుప్రీంకోర్టు మాన్యువల్ స్కావెంజర్లకు పునరావాసం కల్పించాలని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం మాన్యువల్ స్కావెంజర్లను గుర్తించే పనిలోనే ఉంది. దేశంలో ఉన్న అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, వాటికి అనుసంధానించబడి ఉన్న మాన్యువెల్ స్కావెంజర్లను గుర్తించడానికి కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ 2020 డిసెంబరు 24న 'స్వచ్ఛత అభియాన్' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. దీని ద్వారా 6,253 మంది మాన్యువల్ స్కావెంజర్స్‌ను గుర్తించారు. ఈ సంఖ్య సరైనదా.. కాదా.. అనే విషయం తెలియదని మంత్రిత్వ శాఖ చెబుతుంది. ఎందుకంటే ఈ యాప్ ద్వారా ఎవ్వరైనా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని చెబుతుంది. దీనిని క్షేత్రస్థాయిలో నిర్ధారించడానికి ప్రోగ్రామ్ మోనటరింగ్ యునిట్ (పిఎంయు) బృందంతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కూడా తెలిపింది. ఇప్పటి వరకూ ఒక్క అపరిశుభ్రమైన మరుగుదొడ్డిని కూడా నిర్ధారణ చేయలేదు. యాప్‌లో మాత్రం మరుగుదొడ్ల చిత్రాలు, మాన్యువల్ స్కావెంజర్ల వివరాలు నమోదై ఉన్నట్లు కనిపిస్తుంది. మరోవైపు, నేషనల్ సఫాయి కరంచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌కెఎఫ్‌డిసి) సమాచారం ప్రకారం దేశంలో ఇప్పటి వరకూ 58,098 మంది మాన్యువల్ స్కావెంజర్లను గుర్తించారు. ఈ సంఖ్య కూడా వాస్తవ సంఖ్యను ప్రతిబింబించడం లేదని, ఈ సంఖ్యలోని వారంతా ప్రస్తుతం వృతిలో కొనసాగడం లేదని కేంద్రం చెబుతుంది. దేశంలోని మొత్తం 766 జిల్లాలో 551 జిల్లాలను మాన్యువల్ స్కావెంజర్లరహిత జిల్లాలుగా గుర్తించామని, మిగిలిన 215 జిల్లాల సమాచారం కోసం వేచిచూస్తున్నామని తెలిపింది. తమిళనాడు, బీహార్, చత్తీస్‌గఢ్, పుదుచ్చేరి, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం, లడఖ్, త్రిపుర రాష్ట్రాలు తమ రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలను మాన్యువల్ స్కావెంజర్స్‌రహిత జిల్లాలుగా ప్రకటించాయి. 2014 అక్టోబర్ నుంచి స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) పథకం కింద 17 కోట్ల పరిశుభ్రమైన మరుగుదొడ్లను, స్వచ్ఛ భారత్ మిషన్(పట్టణం) ద్వారా 62.81 లక్షల మరుగుదొడ్లను నియమించామని కేంద్రం చెబుతుంది. ఇది మాన్యువల్ స్కావెంజింగ్ నిర్మూలనకు దోహదం చేసిందని కేంద్రం చెబుతుంది. 2013 నుంచి ఇప్పటి వరకూ మురుగు కాల్వలు, సెప్టిక్ ట్యాంక్‌లను ప్రమాదకర పరిస్థితుల్లో శుభ్రం చేస్తూ 663 మంది మరణించారు. వీటిలో 648 కేసుల్లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో 631 కేసుల్లో పరిహారాన్ని కూడా ప్రభుత్వం చెల్లించింది.

మాన్యువల్ స్కావెంజర్ల గుర్తింపు కోసం జాతీయస్థాయిలో జనాభా గణన నిర్వహించాలని నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కరంచారీస్ (ఎన్‌సిఎస్‌కె) చేసిన సిఫార్సును కూడా కేంద్రం 'సాధ్యం కాదు' అని తోసిపుచ్చింది. మాన్యువల్ స్కావెంజర్ల గుర్తింపు అనేది వారు పనిచేసే స్థలం, లేదా యజమాని ధ్రువీకరణతో ముడిపడి ఉంటుందని, స్వీయప్రకటనతో మాన్యువల్ స్కావెంజర్లను గుర్తించలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. జనాభా గణనతో ఇలాంటివి సాధ్యం కాదని తెలిపింది.

అద్దంకిని ప్రకాశం జిల్లాలో చేరుస్తాం

- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి-అద్దంకి

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అద్దంకిని ప్రకాశం జిల్లాలో చేరుస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం అద్దంకిలో కొనసాగింది. అద్దంకి బస్టాండ్‌లో నిర్వహించిన సభలో లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బిసిల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని తెలిపారు. వైసిపి పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు, మూడు సార్లు బస్సుఛార్జీలు పెంచారని విమర్శించారు. వంద సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన మొదటి సిఎం జగన్ అని ఎద్దేవా చేశారు. 45 ఏళ్లకే పింఛన్ ఇస్తామని నమ్మబలికి..మహిళలు దాచుకున్న అభయహస్తం డబ్బుల రూ.2500 కోట్లు దోచేశాడని ఆరోపించారు. నేషనల్ ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటు కోసం టిడిపి హయాంలో భూసేకరణ చేయగా జగన్ పాలనలో ఆ ప్రాజెక్ట్ ఎత్తిపోయిందన్నారు. దొనకొండ వద్ద ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు టిడిపి కృషి చేస్తే వైసిపి పాలనలో అటకెక్కిందని విమర్శించారు. కస్యపురం గ్రామంలో శివారెడ్డి రైస్ మిల్లు ద్వారా వందల టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారని ఆరోపించారు. వైవి సుబ్బారెడ్డి తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన పోలిరెడ్డి కోరిశపాడు లిఫ్ట్ ప్రాజెక్ట్ జగన్ పూర్తి చేయలేదని, టిడిపి గెలిచిన వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. గుండ్లకమ్మ నదిపై కొత్త బ్రిడ్జ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

దేశంలో గిగ్ కార్మికుల తొలి విజయం

- రాజస్థాన్‌లో ఆర్‌జిడబ్ల్యూ యాక్ట్ ఆమోదం
- సంక్షేమ బోర్డు, భద్రతా నిధి ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో కార్మిక హక్కులు తీవ్రంగా ఉల్లంఘించబడుతున్న ప్రస్తుత సమయంలో రాజస్థాన్ ప్లాట్‌ఫార్మ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) యాక్ట్ 2023 (ఆర్‌జిడబ్ల్యూ యాక్ట్)ను ఆమోదించడం గొప్ప విశేషంగా చెప్పుకోవాలి. ఈ చట్టం ప్రకారం రాష్ట్రంలో పనిచేస్తున్న ప్లాట్‌ఫార్మ్ ఆధారిత గిగ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును, సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయనున్నారు. ఈ చట్ట ప్రకారం గిగ్ వర్కర్ల నమోదు అనేది చారిత్రాత్మకమైనదిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. దీని ప్రకారం ప్రతి ఒక్క కార్మికుడికి ప్రత్యేక ఐడిలను జారీ చేస్తారు. ఇలాంటి చట్టం ఆమోదం దేశంలో గిగ్ కార్మికులు సాధించిన తొలి భారీ విజయంగా చెప్పుకోవాలి. మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకెఎస్ఎస్), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్‌ఎటి) వంటి సంఘాల పోరాటం, అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ నేపథ్యంలో ఈ చట్టం రూపుదాల్చింది. అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం ఇప్పటికే 2022లో ఆరోగ్య హక్కు బిల్లును, కనీస ఆదాయ హామీ బిల్లు 2023 (పని చేసే హక్కును సమర్ధించడం) వంటి ప్రజా అనుకూల, హక్కుల ఆధారిత చట్టాలను రూపొందించడం ప్రశంసలు పొందింది. తాజాగా ఆర్‌జిడబ్ల్యూ యాక్ట్)ను ఆమోదించడంతోపాటు గిగ్ వర్కర్స్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ఫండ్‌కు రూ.200 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. కర్ణాటకలో కొత్తగా కొలువుతీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 'గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు' కింద సమగ్ర ప్రమాద, జీవిత బీమా కవరేజ్ కోసం రూ.3000 కోట్ల సీడ్ ఫండ్‌ను ప్రకటించింది.

బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ తాజా నివేదిక ప్రకారం... దేశంలో గిగ్ ఆర్థిక వ్యవస్థకు సుమారు తొమ్మిది కోట్ల ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం ఉంది. వీరి పని విలువను 250 బిలియన్ల అమెరికా డాలర్లగా అంచనా వేసింది. ఓలా, ఉబెర్, స్విగ్గీ, జమోటా, అర్బన్ కంపెనీ, పోర్టర్, డన్జో, బ్లింక్ ఇట్, అమెజాన్ టర్క్స్ వంటి సంస్థలు అందించే ఈ జీవనోపాధి కోసం లక్షలాది మంది నిరుద్యోగులు (యువత, వృద్ధులు) సిద్ధంగా ఉన్నారు.

'పిఎస్‌ఎల్‌వి సి-56' విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

57 పిఎస్‌ఎల్‌వి రాకెట్ల ప్రయోగం జరిగింది. ఇస్రో ఇప్పటి వరకూ 92 రాకెట్లను షార్ నుండి ప్రయోగించింది. 34 దేశాలకు చెందిన 424 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించి సత్తా చాటింది. తాజా ప్రయోగంతో ఇస్రో ప్రయోగించిన విదేశీ ఉపగ్రహాల సంఖ్య 431కు చేరుకుంది. పిఎస్‌ఎల్‌విసి-56 ద్వారా ప్రయోగించిన ఏడు ఉపగ్రహాల బరువు 422 కిలోలు. అందులో ప్రధానమైన డిఎస్ సార్ ఉపగ్రహం బరువు 352 కిలోలు. పిఎస్‌ఎల్‌విసి-56 ప్రయోగం జరిగిన తరువాత 19.30 నిమిషాలకు మొదటి ఉపగ్రహం డిఎస్ సార్ ఉపగ్రహాన్ని కక్ష్యలో విజయవంతంగా నిలిపారు. అనంతరం ఆరు నానో ఉపగ్రహాలను కక్ష్యలో నిలపడంతో ఈ ప్రయోగం పూర్తి స్థాయిలో విజయవంతమైనట్లు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు.

అంతరిక్ష పరిశోధనలో మరో చరిత్రకు ఇస్రో ముందడుగు

అంతరిక్ష వ్యర్థాల నిర్మూలనకే ఈ పరిశోధన

అంతరిక్ష పరిశోధనలో ఎప్పటికప్పుడు కొత్త తరహా ప్రయోగాలు చేపడుతున్న ఇస్రో మరో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. పిఎస్‌ఎల్‌విసి- 56 రాకెట్‌లో డి ఆర్బిటింగ్ ఎక్స్పరిమెంట్ చేశారు. ఈ రాకెట్ నాలుగో దశ ఉపగ్రహాలను విడిచిపెట్టిన తర్వాత మరింత కిందికి దిగేలా ప్రయోగించారు. ఇటీవల అంతరిక్షంలో వ్యర్థాల సమస్య ప్రపంచ శాస్త్రవేత్తలకు సైతం ఇబ్బంది కలిగిస్తోంది. ఉపగ్రహాలను విడిచిపెట్టిన తర్వాత అదే ప్రాంతంలో పరిభ్రమిస్తుండడం లేదా ఒకే చోట ఉండడం వల్ల ఆ మార్గంలో తిరిగే ఉపగ్రహాలకు అడ్డంగా ఏర్పడుతోంది. ఫలితంగా అంతరిక్షంలోనే కొన్నిసార్లు ఢీకొనడంతో ఉపగ్రహాల కాలపరిమితి ముందే తీరిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీన్ని కొంత అడ్డుకునేందుకు అంతరిక్ష పరిశోధకులు కొన్ని కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పిఎస్‌ఎల్‌విసి-56 రాకెట్ నాలుగో దశ పని పూర్తి అయిన తర్వాత కిందికి తీసుకొచ్చి భూమికి ఎటు చూసినా 300 కిలోమీటర్ల దూరంలో చేరేలా ప్రయోగించారు. వృత్తాకార కక్ష్యలో ఇది ఆ స్థానంలో పరిభ్రమిస్తుంది. భూమి ఆకర్షణ శక్తికి దగ్గరగా ఉండడం వల్ల కొద్ది రోజులు తిరిగి పడిపోయే అవకాశం కూడా ఉంది. దీనివల్ల ఉపగ్రహాలకు అడ్డంకి లేకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



మాస్కో : రష్యా రాజధాని నగరం మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్‌లు దాడి చేశాయని మాస్కో నగర మేయర్ సెర్గి సోబియానిన్ ఆదివారం ఉదయం తెలిపారు. నగరంలోని ఆఫీస్ టవర్లు రెండు స్వల్పంగా దెబ్బతిన్నాయని, ఎవరూ గాయపడలేదని లేదా మరణించలేదని సోబియానిన్ తన టెలిగ్రామ్ చానెల్‌లో తెలిపారు. ఈ దాడిలో మొత్తంగా మూడు డ్రోన్‌లు పాల్గొన్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మాస్కో వెలుపలే గాల్లోనే ఒక డ్రోన్ ధ్వంసమైందని, మిగిలిన రెండింటినీ వైమానిక రక్షణ వ్యవస్థలు నిర్వీర్యం చేశాయని ఆ ప్రకటన పేర్కొంది. దాంతో ఆ రెండు డ్రోన్‌లు నగరంలోని నివాసయేతర కాంప్లెక్స్ ప్రాంతంలో పడిపోయాయని తెలిపింది. 50 అంతస్తుల ఐక్యూ కార్టర్ కాంప్లెక్స్‌లో ఐదు, ఆరవ అంతస్తుల మధ్య పెద్ద పేలుడు సంభవించిందని స్థానిక మీడియా తెలిపింది. ఏడు మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వసంస్థలకు చెందిన కార్యాలయాలు ఆ కాంప్లెక్స్‌లో వున్నాయి. ఒకో- 2 భవనంలో రెండో పేలుడు సంభవించిందని, అక్కడ సెక్యూరిటీ గార్డు ఒకరు గాయపడ్డారని తెలిపింది. దెబ్బతిన్న భవనాలను వెంటనే ఖాళీచేయించారు.

3లోగా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి సూచనలివ్వండి

- దక్షిణ మధ్య రైల్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమృత్ భారత్‌స్టేషన్ స్కీమ్ కింద విజయవాడ రైల్వే డివిజన్‌లోని 11 స్టేషన్లను అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వాలనుకునే వారు ఆగస్టు 3లోగా ట్విట్టర్, ఇ మెయిల్ ద్వారా స్పందించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పథకం కింద అభివృద్ధి చేయాల్సిన స్టేషన్ల జాబితాలో అనకాపల్లి, భీమవరం టౌన్, ఏలూరు, కాకినాడ టౌన్, నరసాపూర్, నిడదవోలు, ఒంగోలు, సింగరాయకొండ, తాడేపల్లిగూడెం, తెనాలి, తుని స్టేషన్లు ఉన్నాయి.

స్వర్ణాల చెరువు వద్ద యాత్రికుల సందడి

గంధమహోత్సవానికి తరలిన యాత్రికులు

- నెల్లూరులో కొనసాగుతున్న రొట్టెల పండుగ

ప్రజాశక్తి-నెల్లూరు

రొట్టెల పండుగకు రద్దీ పెరిగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి గంధమహోత్సవం ప్రారంభం కానున్న నేపథ్యంలో నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద యాత్రికుల సంఖ్య పెరిగింది. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బారాషాహిద్ దర్గాను, స్వర్ణాల చెరువును జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, ఆర్‌డిఒ మాలోల, ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి పరిశీలించారు. నగర పాలక సంస్థ, పోలీసు, అగ్నిమాపక, మత్స్య, విద్యుత్ శాఖల సిబ్బంది మూడు షిప్టుల్లో 24 గంటలు విధులు నిర్వహిస్తూ యాత్రికులకు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో మూడు రోజులు పండుగ జరగనున్న నేపథ్యంలో ఆ మేరకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులపై తన బాధను, ఆవేదనను వ్యక్తం చేశారన్నారు. తాము చెప్పిన మాటలతో గవర్నర్ ఏకీభవించారని తెలిపారు. అన్ని తెగల వారితోనూ సమావేశాలను ఏర్పాటు చేసి, సమస్యకు పరిష్కారాన్ని కనుగొనాలని ఆమె చెప్పారన్నారు. అధికార, ప్రతిపక్షాలు కలిసి రాష్ట్రానికి అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని పంపించాలని సలహా ఇచ్చారని చెప్పారు. ప్రజల్లో ఉన్న అపనమ్మకాన్ని పారదోలడానికి, సమస్యను పరిష్కరించడానికి అన్ని తెగల ప్రతినిధులతోనూ సమావేశాలు ఏర్పాటు చేయాలని చెప్పారన్నారు. ఈ సలహాకు తాము కూడా అంగీకారం తెలిపామని చెప్పారు. మణిపూర్ పర్యటనలో తాము తెలుసుకున్న అంశాలను పార్లమెంటులో కూడా చెప్పేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితి రోజు రోజుకూ క్షీణిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల జరిగిన లోపాలను పార్లమెంటులో ప్రస్తావిస్తామన్నారు. దీనిపై పార్లమెంటులో చర్చించాలని పట్టుబడతామన్నారు. లోయలో నివసిస్తున్న మెయితీలు రాష్ట్రంలోని కుకీలు నివసిస్తున్న కొండ ప్రాంతాల్లోకి వెళ్లలేకపోతున్నారని, అదేవిధంగా కుకీలు లోయ ప్రాంతంలోకి రాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ సరుకులు, పశువుల దాణా, పాలు, చిన్న పిల్లల ఆహారం వంటి నిత్యావసర వస్తువుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందన్నారు. ఈ సమస్యలన్నిటినీ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించాలని గవర్నర్ చెప్పారన్నారు.

పూర్తిగా స్తంభించిన డబుల్ ఇంజిన్ సర్కార్ : సిపిఎం ఎంపి ఎఎ రహీం

గుండెలను పిండేసింది

మణిపూర్‌లో అన్నివ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయని, డబుల్ ఇంజిన్ సర్కార్ పూర్తిగా స్తంభించిందని, విఫలం అయిందని సిపిఎం ఎంపి ఎఎ రహీం అన్నారు. తాము కుకీ, మెయితీ సహాయ శిబిరాలు సందర్శించామని, దురదష్టవశాత్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సహాయ శిబిరాలకు ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదని విమర్శించారు. ఆహారం, మెడిసన్ వంటి నిత్యావసరాలు సహాయ శిబిరాల్లోని బాధితులకు అందటం లేదని అన్నారు. చాలా మంది మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, చాలా మందిని నరికి చంపుతున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోడీ వందేభారత్ రైళ్లకు జెండా ఊపడానికి దేశమంతా తిరుగుతున్నారని, కానీ మణిపూర్‌కు ఎందుకు వెళ్లరని, అక్కడి ప్రజల బాధలను ఎందుకు వినరని ప్రశ్నించారు. ఎందుకంటే అక్కడ విద్వేష రాజకీయాలకు ఆర్‌ఎస్ఎస్, బిజెపిలే కారణమని విమర్శించారు. అక్కడ శాంతి పునరుద్ధరణకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని అన్నారు. తాము ప్రజలతో మాట్లాడామని, ఆ అంశాలు పార్లమెంట్‌లో లేవనెత్తుతామని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ మాట్లాడుతూ మణిపూర్‌పై కేంద్రం జోక్యం చేసుకోకపోతే మరింత దిగజారుతాదని అన్నారు. అన్ని వర్గాల మధ్య శాంతిని పునరుద్ధరించాలని తాము డిమాండ్ చేస్తున్నామని ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా పేర్కొన్నారు. టిఎంసి ఎంపి సుస్మిత దేవ్ మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి బిరెన్ సింగ్‌పై ప్రజలు పూర్తిగా విశ్వాసం కోల్పోయారని, సామాన్య ప్రజలు ఇకపై మణిపూర్ సిఎంకు మద్దతు ఇవ్వటం లేదని అన్నారు. తాను జూలై 19న మణిపూర్‌లో పర్యటించానని, మళ్లీ ఇప్పుడు పర్యటించానని, కానీ అక్కడ ఏమాత్రం పరిస్థితుల్లో మార్పు లేదని పేర్కొన్నారు. సూర్య అస్తమయం కాగానే లోయ, కొండ ప్రాంతాల సరిహద్దుల్లో రెండు వైపుల కాల్పులు జరుగుతున్నాయని తెలిపారు. సహాయ శిబిరాల్లో చాలా మంది మహిళలు, చిన్నారులు ఉన్నారని, ప్రజలు అభద్రతలోఉన్నట్లు భావిస్తున్నారని తెలిపారు. ఆయా గ్రూపుల వద్దనున్న ఆయుధాలను ఇంకా స్వాధీనం చేసుకోలేదని పేర్కొన్నారు. ఎవరైనా సహాయ శిబిరాల నుంచి ఇళ్లకు వెళ్తే ప్రజలపై ఆ ఆయుధాలనే ఉపయోగిస్తున్నారని తెలిపారు.

60 వేల మంది నిరాశ్రయులు

"మణిపూర్‌లో హింస కారణంగా ప్రభావితమైన వ్యక్తుల ఆందోళనలు, అనిశ్చితులు, బాధలను విని చాలా షాక్‌కు గురయ్యాం. విచారంగా ఉంది. అన్ని వర్గాల మధ్య ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుండి రెండు వైపులా కోపం, పరాయీకరణ భావం ఉంది. వారికి న్యాయం, శాంతి కావాలి. వీటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలి" ప్రతినిధి బృందం వినతిపత్రంలో పేర్కొంది. "రెండు వర్గాల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించడంలో విఫలమైనందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యత వహించాలి. గత మూడు నెలల్లో 60,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. 150 మందికి పైగా మరణించారు. 500 మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. ఐదు వేలకు పైగా ఇళ్లు దగ్ధం అయ్యాయి" అని పేర్కొంది. "గత కొన్ని రోజులుగా నిరంతరాయంగా కాల్పులు, ఇళ్లు దగ్ధాలు జరుగుతున్నాయి" అని తెలిపింది. సహాయక శిబిరాల "దయనీయమైన" పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అక్కడ నివసిస్తున్న పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. అన్ని పాఠశాలలు, విద్యాసంస్థలు మూసివేయబడినందున విద్యార్థులు అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలి" అని కోరింది. "గత మూడు నెలలుగా కొనసాగుతున్న ఇంటర్నెట్ నిషేధం నిరాధారమైన పుకార్లకు సహాయం చేస్తోంది. ఇది ఇప్పటికే ఉన్న అపనమ్మకాన్ని పెంచుతోంది" అని పేర్కొంది. "గత 89 రోజులుగా మణిపూర్‌లో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్‌గా మీరు తెలియజేయాలి. మణిపూర్‌లో జరిగిన హింసాకాండపై ప్రధానమంత్రి మౌనం ఆయన ఉదాసీనతను తెలియజేస్తోంది" అని విమర్శించింది. "శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడానికి, "పునరావాసం, పరిహారం" అత్యవసర ప్రాతిపదికన ప్రారంభించడం చాలా అవసరం" అని వినతిపత్రంలో స్పష్టం చేసింది. మణిపూర్ పర్యటనలోఎంపిలు అధిర్ రంజన్ చౌదరి, గౌరవ్ గొగోయ్, కె.సురేష్, ఫూలో దేవి నేతమ్ (కాంగ్రెస్), సుస్మిత దేవ్ (టిఎంసి), మహువా మాఝీ (జెఎంఎం), కనిమొళి (డిఎంకె), ఎఎ రహీం (సిపిఎం), సంతోష్ కుమార్ (సిపిఐ), మహమ్మద్ ఫైజల్ (ఎన్‌సిపి), రాజీవ్ రంజన్ లలన్ సింగ్, అనిల్ ప్రసాద్ హెగ్డే (జెడియు), జావేద్ అలీ ఖాన్ (ఎస్‌పి), చౌదరి జయంత్ సింగ్ (ఆర్‌ఎల్‌డి), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), అరవింద్ సావంత్ (శివసేన-యుబిటి) ఎన్‌కె ప్రేమ చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), టి. తిరుమవలవన్, డి. రవి కుమార్ (విసికె), ఈటి మహమ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), సుశీల్ గుప్తా (ఆప్) తదితరులు ఉన్నారు.

నిలకడగానే బుద్ధదేవ్ ఆరోగ్యం

- వెంటిలేటర్‌పై కొనసాగుతున్న చికిత్స



కోల్‌కతా : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నాయకులు బుద్ధదేవ్ భట్టాచార్య (79) ఆరోగ్యం క్లిష్టంగానే ఉన్నా, నిలకడగా ఉందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఉడ్‌ల్యాండ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ డాక్టర్ రూపాలి బసు ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన శనివారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఉడ్‌ల్యాండ్స్ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. క్రిటికల్ కేర్ యూనిట్‌లో నాన్ ఇన్వాసివ్ వెంటిలేటర్‌పై ఉంచి వివిధ విభాగాల వైద్య నిపుణుల బృందం ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తోందని రూపాలి బసు పేర్కొన్నారు.

ఐటిపై నివేదికను అనుమతించొద్దు

- లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్‌పర్సన్‌లకు సిపిఎం ఎంపి లేఖ

న్యూఢిల్లీ : డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుపై వ్యాఖ్యలతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికను సభలో ప్రవేశపెట్టడానికి అనుమతించవద్దని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్‌పర్సన్‌లను కోరారు. ఐటి, కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘ సభ్యుడి హెూదాలో ఆయన పార్లమెంటు ఉభయ సభల అధిపతులకు ఈ మేరకు ఒక లేఖ రాశారు. ఏదైనా బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత లోక్‌సభ స్పీకర్ గానీ లేదా రాజ్యసభ ఛైర్‌పర్సన్ గానీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించినప్పుడు మాత్రమే ఆ కమిటీ వాటిని పరిశీలించి నివేదిక ఇవ్వడం ఆనవాయితీ. ఐటి బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపుతున్నట్లు లోక్‌సభ స్పీకర్ నుంచి కానీ, రాజ్య సభ ఛైర్‌పర్సన్ నుంచి కానీ ఎలాంటి నివేదన లేనప్పుడు దానిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎలా నివేదిక ఇస్తుంది? అటువంటి అధికారం వాటికి ఎక్కడిది? అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుత కేసులో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లును ఇప్పటివరకు ఎన్నడూ పార్లమెంట్ ఉభయ సభల్లోనూ అసలు ప్రవేశపెట్టనే లేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. శివసేన ఎంపి ప్రతాప్ రావు జాదవ్ నేతృత్వంలోని కమ్యూనికేషన్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞానంపై స్థాయీ సంఘం సభ్యుల్లో బ్రిట్టాస్ ఒకరు.. కమ్యూనికేషన్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞానంపై స్థాయీ సంఘం ఈ నెల 26నాటి సమావేశంలో ఆమోదించినట్టుగా చెప్పబడుతున్న నివేదికకు ఎలాంటి చట్టబద్ధత లేదని ఆయన అన్నారు. స్థాయీ సంఘం అధికారాలకు పూర్తి విరుద్ధంగా ఈ నివేదిక తెచ్చారు. జులై 26నాటి స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని బ్రిట్టాస్‌తో సహా పలువురు ప్రతిపక్ష సభ్యులు బహిష్కరించారు. బ్రిట్టాస్ అసమ్మతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపిన బిల్లుకు అనుగుణంగా ఈ నివేదికను వండివార్చారని చెప్పారు. ప్రతిపక్ష ఎంపీలు లేవనెత్తిన అభ్యంతరాలను కమిటీలోని బిజెపి సభ్యులు తోసిపుచ్చారు. కమిటీ చర్య నిబంధనలకు అనుగుణంగానే వుందని వారు నమ్మబలుకుతున్నారు. "ఈ బిల్లుపై వ్యాఖ్యలు, సిఫార్సులను చేర్చడంలో కమిటీ తీసుకున్న చర్య దాని అధికార పరిధిని దాటిందని బ్రిట్టాస్ పేర్కొన్నారు. కాబట్టి లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ నివేదికను ప్రవేశపెట్టడానికి నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని ఆయన ఆ లేఖలో కోరారు.

అమరవీరుల కోసం 'మేరీ మాటి మేరా దేశ్'

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ ప్రకటన

ఢిల్లీ: 'మేరీ మాటి మేరా దేశ్' పేరుతో కొత్త ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆల్ ఇండియా రేడియోలో ప్రసంగించే 'మన్ కీ బాత్' 103వ ఎపిసోడ్‌లో ఆయన ఈప్రకటన చేశారు. దేశ వ్యాప్తంగా అమరవీరుల గౌరవార్థం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అకాల వర్షాల కారణంగా దేశంలోని వేర్వేరు రాష్ట్రాల్లో సంభవించిన వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ప్రధాని అభినందించారు. దాదాపు 90 రోజులుగా కాలిపోతున్న, అనిశ్చితి నెలకొన్న మణిపూర్ గురించి మన్ కీ బాత్‌లో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం కొసమెరుపు.

రైతు సమస్యలపై రెండో దశ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

హక్కులు ఉండాలని, అదే స్ఫూర్తితో రైతాంగ పోరాటం ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. సరైన గౌరవం,హక్కులు లభించినప్పుడే రైతులకు భరోసా ఉంటుందన్నారు. ఎపిలో తీసుకొచ్చిన భూ సేకరణ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తూ రైతుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. రాజధాని పేరుతో భూములు తీసుకొని రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. రైతులకు భూములను తిరిగిఇవ్వకుండా అక్కడ వ్యవసాయాన్ని నిలిపివేసిందని పేర్కొన్నారు. పంట సాగు దారుల హక్కు చట్టాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చి కౌలు రైతులకు కార్డులు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. రైతులను పేదలుగా చేసే విధానాలు కూడా ఒక విధమైన రాజ్య హింస అని అన్నారు. బ్రిటీష్ పక్షాన ఉండి జాతీయ జెండాను కూడా స్వీకరించని ఆర్‌ఎస్ఎస్ శక్తులు దేశాన్ని పాలిస్తున్నాయని తెలిపారు. ఎఐకెఎంఎస్ జాతీయ కార్యదర్శి అశోక్ ఘూయాల్ మాట్లాడుతూ కులాలు, మతాలను మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని అస్థిరపరచాలని బిజెపి, ఆర్‌ఎస్ఎస్ మొదటి నుంచి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దేశ లౌకిక వాద స్వరూపాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కెకెయు జాతీయ అధ్యక్షులు రామీందర్ సింగ్ పాటియాలా మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని కేంద్రం గాలికివదిలేసిందని విమర్శించారు. ఇది తీవ్రమైన సంక్షోభానికి దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలిండియా కిసాన్ సెల్(కాంగ్రెస్)అధ్యక్షులు సుఖ్‌పాల్ సింగ్ ఖైరా మాట్లాడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు రూ.10లక్షల కోట్లను నరేంద్రమోడీ దోచిపెట్టారని విమర్శించారు.దేశాన్ని రక్షించుకునేందుకు జై జవాన్-జై కిసాన్ నినాదంతో ఉద్యమం నిర్మించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే తీర్మానాన్ని స్టీల్ ప్లాంట్ పరిరక్షణ నాయకులు రాజమోహన్ బలపరిచారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'మేలుకో భారత్' పుస్తకాన్ని హన్నన్ మొల్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ నాయకులు ఆర్ చంద్రశేఖర్, ఎఐఎకెఎస్ జాతీయ కార్యదర్శి పివి సుందరరామరాజు, ఎపి రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య, సీనియర్ నాయకులు వై కేశవరావు, ఎపి కౌలు రైతు సంఘం నాయకులు ఎం హరిబాబు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కన్నీటి వరద

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. ఎటపాక, కూనవరంల్లోనూ పలుచోట్ల ఇదే పరిస్థితి ఉంది. వరద బాధితులు కష్టాలు అనుభవిస్తున్నారు.

ప్రభుత్వానికి మేం పట్టమా?

ఈసారీ మమ్మల్ని ప్రభుత్వం గాలికొదిలేసింది. వరద గురించి హెచ్చరించిన అధికారులు ఆ తరువాత మమ్మల్ని పట్టించుకోలేదు. సొంత ఖర్చులతోనే పునరావాస కేంద్రాలకు వచ్చాం. ఇక్కడ సదుపాయాలు లేవు. దీంతో, ఇక్కడే చిన్నపాటి పాకలు, గుడారాలు ఏర్పాటు చేసుకున్నాం. తాగునీరు కూడా మాకు అందలేదు. కిరోసిన్, కొవ్వొత్తులు వంటి వాటిని కూడా ప్రభుత్వం అందించలేదు. రాత్రయితే చాలు భయమేస్తోంది.

– కోట్ల సురేష్, గొల్లగూడెం గ్రామం, విఆర్.పురం మండలం

కందిపప్పు ఇచ్చి చేతులు దులుపుకున్నారు

స్థానిక అధికారులు 27వ తేదీన వచ్చి హడావుడి చేసి మా ఇళ్లు ఖాళీ చేయించారు. ఫ్లడ్ సెంటర్లకు తరలి వెళ్లాలని, లేదంటే వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆ తరువాత మమ్మల్ని పట్టించుకోలేదు. పది రోజులుగా వర్షం, వరద వల్ల చేతిలో చిల్లిగవ్వలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. రూ.2 వేలు సొంత డబ్బులు వెచ్చించి ఒక్కో కుటుంబం ఆటోలు, వ్యాన్లను కిరాయికి మాట్లాడుకుని ఎర్రంపేటలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వచ్చాం. ఇక్కడ ఒక గదిలో ఆరు కుటుంబాల వారిమి ఉంటున్నాం. కేజీ కందిపప్పు మాత్రమే ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. బియ్యం, మంచి నూనె, ఉప్పు, కారం వంటివి ఇవ్వలేదు. ఎలా బతకాలి. తక్షణం నిత్యావసర సరుకులు అందించాలి.

– చింతూరు శబరిఒడ్డు వాసులు

మీకోసం

కాఫీ పొడి గడ్డ కట్టకుండా ఉండాలంటే ఎయిర్‌టైట్ డబ్బాలో నిల్వ చేసి, డీప్ ఫ్రిజ్‌లో ఉంచాలి.

జీవన సౌరభం

మాట్లాడిన తర్వాత ఆలోచించి ప్రయోజనం ఉండదు. ఆలోచించిన తర్వాతే మాట్లాడాలి.

ఆకాశంలో హరివిల్లు
చాలా కాలానికి ...
ఎండయ్యతో కలసి
వానమ్మ వచ్చింది...
ఊరంతా నీరెండ వాన..!

మిన్ను నుంచి కురిసేను
సన్న సన్నటి వెన్నెల సోన
బడి ఈడు పిల్లలంతా వానలో
తడిసి వీధుల్లో యమగోల..

విను వీధిలో విరిసే హరివిల్లు..
చిన్నారులలో కురిసే చిత్త జల్లు !

– జి.సూర్యనారాయణ, దివిసీమ.

చుక్కలు కలపండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఇంగ్లీషు అక్షరాలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి..

సరైన పదాలు రాయండి

1. గాలి H A I R
2. ఎరుపు R E A D
3. చెవి Y E A R
4. బెజ్జము W H O L E
5. వాన
6. రాత్రి
7. లాభపడు

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలు ఇచ్చాం. వాటిని ఇంగ్లీషులో ఏమంటారో మీరు రాయండి.

నేను గీసిన బొమ్మ

- రామిశెట్టి అక్షర గీతిక, 9వ తరగతి, శ్రీ చైతన్య స్కూలు, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జుట్టుపైన, గోళ్లు పైనా వాళ్లదే పెత్తనం!

ఏ మతమైనా మహిళలను నిర్బంధాల సుడిలోకి నెట్టేస్తుంది. ఏ దుస్తులు వేసుకోవాలి.. ఏం తినాలి.. ఎలా ఉండాలి. ఎలా నడుచుకోవాలి వంటి విషయాల్లో మహిళలపై నిర్బంధాలు రాజ్యమేలుతాయి. అందుకే బ్యూటీపార్లర్‌లో సాధారణంగా చేసే కనుబొమ్మల ఆకృతి, వివిధ రకాల కేశాలంకరణ, గోళ్లు కత్తిరించుకోవడం, మేనిఛాయ మెరుపు వంటి పనులన్నింటినీ వారు ఘోరాతిఘోరంగా పరిగణించారు.

మతోన్మాదం తలకెక్కిన పాలకులు మాత్రం తమ చర్యలను ఎప్పుడూ సమర్థించుకుంటూనే ఉంటారు. రెండో తరగతి వ్యక్తులుగా లెక్కగట్టి మహిళల హక్కులను కాలరాస్తూనే ఉంటారు. స్త్రీ, పురుషులు సమానమనే పురోగామి భావన వారికి ఆమోదయోగ్యం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజా జీవితంలో మహిళలకు స్థానం లేకుండా చేయడమే వారి లక్ష్యం. అందుకే తాలిబన్లు హస్తగతం చేసుకున్నప్పటి నుంచి ఆఫ్ఘన్‌లో ఆడపిల్లలు రోడ్డుపై నడవాలంటేనే భయపడేలా ఆంక్షలు విధించారు. స్కూళ్లు మూసేశారు. విశ్వవిద్యాలయాల్లో సీట్లు రద్దు చేశారు. మహిళా ప్రొఫెసర్లను విధుల నుంచి తొలగించారు. టీవీ మాధ్యమాలు, వార్తా ఛానెళ్లలో మహిళా ఉద్యోగులను కార్యాలయాల నుంచి వెళ్లగొట్టారు. క్రీడాకారులను ఆడటానికి వీల్లేదన్నారు. పార్కులకు వెళ్లేందుకు అనుమతి లేదు. బహిరంగంగా నిర్వహించే ఫంక్షన్లకు వెళ్లకూడదు. జిమ్‌లో ప్రవేశం లేకుండా చేశారు. ఇప్పుడు తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో మహిళలు ప్రధానంగా ఆధారపడిన రంగం మూతబడి ఆర్థికంగా వారి కుటుంబాలు అల్లకల్లోలమవుతున్నాయి. 60 వేల మంది మహిళలకు ఉపాధి పోయింది.

'నా ఆహారం, నీళ్ల తీసుకోకండి..' అని రాసిన ప్లకార్డులతో, 'మాకు విద్య లేకుండా చేశారు. ఉపాధిని దూరం చేశారు. ఎంతకాలం ఈ నిర్బంధాలను భరించాలి' అంటూ నినాదాలు చేస్తున్న మహిళా ఉద్యమకారులు ఇప్పుడు అక్కడ కనిపిస్తున్నారు. 'మేం పుట్టిన దేశంలో ఎన్నో కలలతో బతుకుతున్న మాకు ఈ రోజు ఇంతటి దుర్భర పరిస్థితులు వచ్చాయి. ఈ రోజు గొంతెత్తి నినదిస్తున్నా మా గోడు ఎవరూ వినిపించుకోవడం లేదు. మా కోసం ఎవరూ రావడం లేదు. అసలు మేం మనుషులం కాదా? మాపైనే ఎందుకిన్ని ఆంక్షలన్న ఆ మహిళల ఆవేదన మతోన్మాద పాలకుల ఏలుబడిలో అరణ్య రోదనే అవుతోంది.

మతం వ్యక్తిగతం. కానీ, మతోన్మాద పాలకుల ఏలుబడిలో ఉన్న దేశాల్లో మతం ఓ ఆయుధం. మతం పేరుతో అణచివేత, హింస, స్వేచ్ఛను కాలరాయడం అక్కడ సర్వసాధారణం. ఒకప్పటి సోవియట్ యూనియన్ ప్రభావంతో పురోగామి మార్గంలో పయనించిన ఆఫ్ఘన్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులే ఇందుకు ఉదాహరణ. ఆఫ్ఘన్‌ను తాలిబన్లు కైవసం చేసుకున్నప్పటి నుంచి అక్కడి మహిళలకు స్వేచ్ఛ లేదు. విద్య లేదు. ఉద్యోగాలు లేవు. తాజాగా మహిళల సౌందర్య పోషకాలుగా చలామణి అయ్యే బ్యూటీపార్లర్లపై కూడా నిషేధం విధించారు.

'ఎందుకంత గోల చేస్తున్నారు.. ఇవి సాంప్రదాయ ధోరణులు. మిమ్మల్ని స్వేచ్ఛ, గౌరవప్రదమైన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకే ఇవి నిర్దేశించబడినవి. మీరు మేకప్ వేసుకుని ప్రార్థనలు ఎలా చేస్తారు? జుట్టు కత్తిరించుకుని ఎలా నిగ్రహంగా ఉంటారు?' వంటి అడ్డగోలు వాదనలను అక్కడి తాలిబన్లు వినిపిస్తున్నారు. 'మహిళలు చీరలే కట్టుకోవాలి. ఉద్యోగం చేసే మహిళ విర్రవీగి ఉంటుంది. అత్యాచారాలకు పాల్పడుతున్నారంటే అది మహిళలదే తప్పు' అన్న మన బిజెపి పాలకుల మాటలు కూడా ఇలాగే ఉంటాయి. ఇంటి గోడలను దాటి బయటి విషయాల్లో కూడా జోక్యం చేసుకునే మతం నిర్వాకం ఎక్కడైనా ఒకేలా ఉంటుంది. తాలిబన్ల ఉన్మాదం, విద్వేషం మహిళల సర్వ హక్కులనూ కాలరాస్తున్నాయి. దీంతో తాలిబన్ మహిళలు అల్లాడిపోతున్నారు. మానసికంగా, శారీరకంగా కుదేలైపోతున్నారు. విశ్వవిద్యాలయాల్లోకి మహిళలకు ప్రవేశం లేదన్న నిబంధన పెట్టినప్పుడు ఎంతోమంది విద్యార్థినులు తీవ్ర ఒత్తిడికి గురైన సంఘటనలు తాజాగా వెలుగుచూశాయి.



'పరిస్థితులు ఇలాగే కొనసాగితే మాకు చావు తప్ప మరో మార్గం లేదు. విశ్వవిద్యాలయం నుండి నన్ను, నా స్నేహితులను తరిమేశారు. మేమంతా తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయాం.. మా ముందరి భవిష్యత్తు అంతా అంధకారంగా తయారైంది' అంటూ 20 ఏళ్ల ఆఫ్ఘన్ విశ్వవిద్యాలయ విద్యార్థి కన్నీటిపర్యంతమౌతూ చెబుతోంది. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆ యువతి ప్రయత్నాన్ని అడ్డుకొన్న తల్లిదండ్రులు ఇప్పుడామెకు మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నారు. 'ఇక్కడ మాకు విద్య, ఉపాధే కాదు.. ఆకలి బాధ కూడా కాదు.. ఈ పరిస్థితులు మమ్మల్ని రోజురోజుకూ చంపేస్తున్నాయి. భవిష్యత్తు మీద ఆశలు సన్నగిల్లి జీవితమంటేనే అసహ్యమేస్తోంది' అంటూ కౌన్సిలింగ్ తీసుకుంటున్న మరో యువతి ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ చెబుతోంది.

'చదువు లేదు, భవిష్యత్తు లేదు.. ఇంట్లో ఉండి మేమేం చేయాలి? అసలు ఈ జీవితం ఎందుకు? ఈ ఆలోచనలు నాకు నిద్రపట్టనివ్వడం లేదు. ఏ విషయం మీద నాకు ఆసక్తి కలగడం లేదు. తీవ్ర మానసిక ఒత్తిడితో రోజంతా ఏడుస్తూ కూర్చొనే ఉంటున్నాను' అంటూ డాక్టరు కావాలని కలలుగన్న మరో విద్యార్థిని బోరున విలపిస్తోంది.

మహిళలను చదువుకు దూరం చేయమని, ఉపాధి లేకుండా చేయమని, నిర్బంధాలు విధించమని ఏ మతం చెప్పింది? కానీ అనాదిగా మతం పేరుతో మహిళలపై అణచివేత కొనసాగిస్తూనే ఉన్నారు.

తొలి 'విజయ' దర్శకులు

టాలీవుడ్‌లో సినిమాలకు కొదవే లేదు. పెద్ద హీరోల నుంచి చిన్న హీరోల వరకూ వారం వారం ఏదో ఒక సినిమా విడుదలవుతూనే ఉంటుంది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో కొన్ని కుటుంబాలకు చెందిన వారే టాప్ హీరోలుగా నిలదొక్కుకున్నారు. కొన్నేళ్లుగాకొత్త హీరోలు, హీరోయిన్లు, డైరెక్టర్లు, నిర్మాతలు కూడా పరిశ్రమలోకి వచ్చి వైవిధ్యమైన కథలను తెరకెక్కిస్తూ బ్లాక్‌బస్టర్లు సృష్టిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ కాలంలో వచ్చిన కొన్ని చిన్న బడ్జెట్ సినిమాలు భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి.

ఈమధ్యనే బలం, విరూపాక్ష సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్స్ అయ్యాయి. ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న బడ్జెట్‌తో వచ్చిన 'బలగం' బ్లాక్ బస్టర్ అయ్యింది. పాన్ ఇండియాగా రిలీజ్ అయినా దసరా, విరూపాక్ష సినిమాలు కొంచెం ఎక్కువ బడ్జెట్‌తో వచ్చి హిట్ అయ్యాయి. అయితే ఈ 3 సినిమాల్లో కామన్ ఫ్యాక్టర్ ఏమిటంటే– డైరెక్టర్లకు ఇవి తొలి సినిమాలు కావడం! తొలి సినిమాతో హిట్ కొట్టిన వేణు యేల్దండి, శ్రీకాంత్ ఓదెల, కార్తీక్ దండుపై చర్చలు సాగుతున్నాయి. 2022లో కూడా కొందరు కొత్త దర్శకులు చేసిన సినిమా బ్లాక్ బస్టర్స్ అయ్యాయి.

షణ్ముఖ ప్రశాంత్ : కలర్ ఫోటో ఫేమ్ సుహాస్ హీరోగా వచ్చిన రైటర్ పద్మభూషణ్ సినిమాతో పరిచయం అయ్యాడు యువ దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్. ఫ్యామిలీ డ్రామా, మదర్ అండ్ ఫాదర్ సెంటిమెంట్‌తో మంచి ఎమోషనల్–కామెడీ డ్రామాతో తొలి హిట్ కొట్టాడు.

మల్లిడి వశిష్ఠ : మల్లిడి వశిష్ఠ రచించి, దర్శకత్వం వహించిన తెలుగు ఫాంటసీ యాక్షన్ చిత్రం 'బింబిసార'. ఇందులో కళ్యాణ్ రామ్ హీరోగా ద్విపాత్రాభినయం చేశారు. పాతకాలపు జానపద చిత్రాలలో విఠలాచార్య విన్యాసాలు, మంత్రముగ్ధులను చేసే కథనంతో ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందింది. త్వరలో చిరంజీవితో సినిమా చేయటానికి ఈ దర్శకుడు రెడీ అవుతున్నాడు.



సాయి కిరణ్ : రెగ్యులర్ హారర్స్‌లా కాకుండా యూనిక్ సెటప్, డిఫరెంట్ హారర్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చిన సినిమా మసూద. హర్రర్ సినిమాల్లో ఇది ఒక కొత్త ట్రెండ్. హారర్ కథను కొత్త పద్ధతిలో చెప్పడం వల్ల ప్రేక్షకులు ఆదరించారు.

వేణు యేల్దండి : జబరదస్త్ వేణుగా మన అందరికి తెలిసిన వేణు యేల్దండి మెగా ఫోన్ పట్టుకుని బలగం సినిమాతో దర్శకుడు అయ్యాడు. వేణు దగ్గర నుండి ఇలాంటి సినిమా ఎవ్వరూ వస్తుందని ఊహించలేదు. ఒక చావు చుట్టూ కథ రాస్తూ దాన్ని చాలా ఎమోషనల్‌గా, కనెక్టింగ్‌గా, హ్యూమన్ రిలేషన్స్ అంటే ఎలా ఉండాలో చెప్పిన విధానం ఈ సినిమాని ప్రేక్షకులు సొంతం చేసుకొని హిట్ చేశారు.

కార్తీక్ దండు : క్షుద్ర పూజల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం ఇది. మూఢనమ్మకాలతో ప్రజానీకం ఇంకా ఎలా ఇబ్బందులు పడుతున్నారో, శాస్త్ర, సాంకేతిక యుగంలో దానిని ఎలా అధిగమించాలో దర్శకుడు కార్తీక్ దండు సరికొత్తగా తెరకెక్కించారు. తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ కొట్టేశాడు కార్తీక్.

శ్రీ కార్తీక్ : శర్వానంద్, రీతూ వర్మ, వెన్నెల కిషోర్, ప్రియదర్శి ప్రధాన పాత్రలు చేసిన ఈ చిత్రం... శ్రీ కార్తీక్‌కి తెలుగులో మొదటిది. తమిళంలో ఇప్పటికే 2 సినిమాలు చేసిన శ్రీ కార్తీక్ ... ఇక్కడ తొలి ప్రయత్నంతోనే హిట్ కొట్టాడు. మనిషి జీవితంలో కాలం విలువను తెలియజేస్తూ, భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాల ఆవశ్యకతను ఇందులో జొప్పించారు. ఈ సినిమాతో హిట్ పట్టిన శ్రీ కార్తీక్ ఇప్పుడు అల్లు అర్జున్‌తో కొత్త సినిమా చేయబోతున్నాడు.

శ్రీకాంత్ ఓదెల : ఐతాయి... ఐతాయి.. బద్దల్ బాషింగల్ ఐతాయి అంటూ శ్రీకాంత్ ఓదెల తన తొలి సినిమా దసరాతో బ్లాక్ బస్టర్ కొట్టారు. తెలంగాణా యాస, కట్టు, బొట్టు నుండి తిండి వరకు అన్నీ ఈ సినిమాలో చాలా సాధారణంగా చూపించారు. నాని కెరీర్‌లో మంచి సినిమాగా దీనిని రూపొందించారు.

సిరీస్ సమం!

రెండో వన్డేలో విండీస్ గెలుపు
నిరాశపరిచిన హార్దిక్ సేన
1న సిరీస్ డిసైడర్

కుర్రాళ్లకు కరీబియన్లు షాక్ ఇచ్చారు. స్వల్ప ఛేదనలో షాయ్ హెూప్ (63) అజేయ అర్థ సెంచరీతో మెరువగా.. 6 వికెట్ల తేడాతో భారత్‌పై వెస్టిండీస్ గెలుపొందింది. 2019 డిసెంబర్ తర్వాత టీమ్ ఇండియాపై వన్డేల్లో కరీబియన్లు సాధించిన తొలి వన్డే విజయం ఇదే కావటం గమనార్హం. తొలుత భారత్ 181 పరుగులకు కుప్పకూలగా.. వెస్టిండీస్ 36.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. సిరీస్ 1-1తో సమం కాగా.. నిర్ణయాత్మక వన్డే ఆగస్టు 1న జరుగనుంది.

బ్రిడ్జ్‌టౌన్ : వెస్టిండీస్ ఎదురు నిలిచింది. రెండో వన్డేలో భారత్‌ను గట్టి దెబ్బ కొట్టింది. కెన్సింగ్టన్ ఓవల్‌లో ఖతర్నాక్ ప్రదర్శన చేసిన కరీబియన్లు 2019 (డిసెంబర్) తర్వాత భారత్‌పై వన్డేల్లో తొలి విజయం సాధించింది. కెప్టెన్ షాయ్ హెూప్ (63 నాటౌట్, 80 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కు తోడు కీసీ కార్టీ (48 నాటౌట్, 65 బంతుల్లో 4 ఫోర్లు) రాణించాడు. 182 పరుగుల లక్ష్యాన్ని 36.4 ఓవర్లలోనే ఛేదించిన వెస్టిండీస్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 40.5 ఓవర్లలో 181 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (55, 55 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో మెరిసినా.. ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. శుభ్‌మన్ గిల్ (34) ఫర్వాలేదనిపించగా.. సంజు (9), అక్షర్ (1), హార్దిక్ (7), జడేజా (10), సూర్య (24) నిరాశపరిచారు. విండీస్ కెప్టెన్ హెూప్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

కరీబియన్లు కొట్టేశారు : 182 పరుగుల స్వల్ప ఛేదనలో ఆతిథ్య విండీస్‌కు మంచి ఆరంభం దక్కింది. బ్రాండన్ కింగ్ (15), కైల్ మేయర్స్ (36, 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 53 పరుగులు జోడించారు. అలిక్ అతానేజ్ (6), షిమ్రోన్ హెట్‌మయర్ (9) నిరాశపరిచినా.. కెప్టెన్ షాయ్ హెూప్ (63 నాటౌట్), కీసీ కార్టీ (48 నాటౌట్) ఐదో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించారు. తొలి వన్డేలో ఇదే పిచ్‌పై స్పిన్ మాయజాలం నడువగా.. రెండో వన్డేలో మాత్రం పేస్‌కు అనుకూలించింది. శార్దుల్ ఠాకూర్ ఒకే ఓవర్లో రెండు వికెట్లతో భారత శిబిరంలో ఆశలు రేపాడు. కానీ హెూప్, కార్టీ జోడీ కరీబియన్లకు మెరుపు విజయాన్ని అందించారు. శార్దుల్ మూడు వికెట్లు తీసుకోగా.. కుల్దీప్ యాదవ్ ఓ వికెట్ పడగొట్టాడు.

కిషన్ మెరిసినా : తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా ఓపెనర్ల దూకుడుతో భారీ స్కోరు దిశగా సాగింది. ఇషాన్ కిషన్ (55), శుభ్‌మన్ గిల్ (34) తొలి వికెట్‌కు 90 పరుగులు జోడించారు. కానీ ఆ తర్వాత భారత మిడిల్ ఆర్డర్ కుప్పకూలింది. సంజు శాంసన్ (9), అక్షర్ పటేల్ (1), హార్దిక్ పాండ్య (7), రవీంద్ర జడేజా (10), శార్దుల్ ఠాకూర్ (16), సూర్య కుమార్ యాదవ్ (24) అంచనాలను అందుకోలేదు. విండీస్ స్పిన్నర్లు మోటీ (3/36), యానిక్ (1/5) మాయ చేయగా.. రోమారియో షెఫర్డ్ (3/37), అల్జారీ జొసెఫ్ (2/35)లు రాణించారు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు రెండో వన్డే మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న సంగతి తెలిసిందే.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : కిషన్ (సి) అతానేజ్ (బి) షెఫర్డ్ 55, గిల్ (సి) జొసెఫ్ (బి) మోటీ 34, సంజు (సి) కింగ్ (బి) యానిక్ 9, అక్షర్ (సి) హెూప్ (బి) షెఫర్డ్ 1, హార్దిక్ (సి) కింగ్ (బి) సీల్స్ 7, సూర్య (సి) అతానేజ్ (బి) మోటీ 24, జడేజా (సి) యానిక్ (బి) షెఫర్డ్ 10, శార్దుల్ (ఎల్బీ) జొసెఫ్ 16, కుల్దీప్ నాటౌట్ 8, ఉమ్రాన్ (సి) కార్టీ (బి) జొసెఫ్ 0, ముకేశ్ (సి) హెట్‌మయర్ (బి) మోటీ 6, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (40.5 ఓవర్లలో ఆలౌట్) 181.

వికెట్ల పతనం : 1-90, 2-95, 3-97, 4-113, 5-113, 6-146, 7-148, 8-167, 9-167, 10-181.

బౌలింగ్ : కైల్ మేయర్స్ 5-0-18-0, జేడెన్ సీల్స్ 6-0-28-1, అల్జారీ జొసెఫ్ 7-0-35-2, జి మోటీ 9.5-0-36-3, రొమిరియో షెఫర్డ్ 8-1-37-3, యానిక్ 5-0-25-1.

వెస్టిండీస్ ఇన్నింగ్స్ : కింగ్ (ఎల్బీ) శార్దుల్ 15, మేయర్స్ (సి) ఉమ్రాన్ (బి) శార్దుల్ 36, అతానేజ్ (సి) కిషన్ (బి) శార్దుల్ 6, హెూప్ నాటౌట్ 63, హెట్‌మయర్ (బి) కుల్దీప్ 9, కార్టీ నాటౌట్ 48, ఎక్స్‌ట్రాలు : 5, మొత్తం : (36.4 ఓవర్లలో 4 వికెట్లకు) 182.

వికెట్ల పతనం : 1-53, 2-54, 3-72, 4-91.

బౌలింగ్ : హార్దిక్ పాండ్య 6.4-0-38-0, ముకేశ్ కుమార్ 3-0-17-0, ఉమ్రాన్ మాలిక్ 3-0-27-0, శార్దుల్ ఠాకూర్ 8-0-42-3, కుల్దీప్ యాదవ్ 8-0-30-1, రవీంద్ర జడేజా 6-0-24-0, అక్షర్ పటేల్ 2-1-4-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68